మూలింటామె

మగటిమికి మరణశాసనం
నామిని **'మూలింటామె'** పై
రాణి శివశంకరశర్మ
తాత్విక భాష్యం

మగటిమికి మరణశాసనం

నామిని **'మూలింటామె'** పై

రాణి శివశంకరశర్మ

తాత్విక భాష్యం.

నామిని 'మూలింటామె' పై
రాణి శివశంకరశర్మ
తాత్విక భాష్యం
ముద్రణ : సెప్టెబరు 2014

ప్రచురణ : గుంటూరు మిత్రులు

ప్రతులకు :
నవోదయ
హైదరాబాద్, విజయవాడ.

ప్రొ. ఎ. సుబ్రహ్మణ్యం
జి.ఎఫ్. 1, సుధా అపార్ట్‌మెంట్స్,
6/13ఎ, బ్రాడిపేట, గుంటూరు.
ఫోన్ : 9000389389

వెల : రూ. 20/-

మ

కూర్చున్న కొమ్మనే స్వయంగా నరుక్కోవడమంత గొప్ప పని మరేదీ లేదు. రాణి శివశంకరశర్మ చేసిందదే. యిప్పుడు నామిని చేస్తున్నది కూడా అదే పని.

ఇదివరకు నామిని నామినిగా రచనలు చేశాడు. యిటీవల నామిని నాలుకపై సరస్వతీదేవి బీజాక్షరాల్ని లిఖించినట్లు అనిపిస్తోంది. అందుకే ఏదో దైవశక్తో ఆదిమశక్తో తీవ్రంగా విజృంభించి అలజడి సృష్టిస్తోంది. అదే మూలింటామె నవల.

అలజడి నా జీవితం, ఆందోళన నా ఊపిరి అని కవి ప్రకటిస్తే ఎవరికీ యిబ్బంది లేదుకాని నిజంగా అలజడి సృష్టిస్తే ఎవరూ తట్టుకోలేరు. కొంచెం సంయమనం పాటించు, కొంచెం కుదురుగా వుండు. అలల్లా ఎగసి పడ్తూ వొడ్డుని కోసేస్తున్న నీ వాక్యాలకి కోతపెట్టు.

సమయం

కుదురు

కోత

వీటిని పాటించమని నామినిలాంటి మహా సాగరానికి పిపీలికం హితబోధ చేస్తుంది.

యింతకీ నామిని యెవడు? వొక మీడియం అంతే. వొక అపారశక్తి వాడుకుంటున్న మీడియం. సరస్వతి మీటుతున్న వీణ అతడు. కాళికాదేవి గజ్జల సవ్వడి అతడు. లేకపోతే తన కులాన్నే తన వర్గాన్నే పాత్రలుగా మలచి, సెక్సుని కూడా వ్యాపార సూత్రంగా మలచుకున్న పంది వసంత పాత్రని సృష్టించగలడా? తను కూర్చున్న కొమ్మనే తాను నరుక్కోగలడా? ఎవరు నీతిమంతులో వాళ్ళే రాళ్ళు వెయ్యాలని, తక్కువ కులం వాడితో లేచిపోయిన అమ్మాయి తరఫున నిలబడగలడా?

నిజమే పంది వసంత బరితెగించింది. ఈ బరితెగించడం అనే పదాన్ని వాడినది నామిని కాదు. క్షుద్ర విమర్శకుడు మాత్రమే ప్రయోగించగలడు.

బరితెగించడం అనే క్రియాపదం మగవాళ్ళకి చెందింది కాదు. అది స్త్రీల పక్కన జేరినపుడు సమాజం అమలుపరుస్తున్న సెక్సు నీతిని అతిక్రమించిన వాళ్ళు అనే అర్థం వస్తుంది.

ఎందుకంటే స్త్రీలనీ, సెక్సునీ అదుపులో పెట్టాలని, ఒకవేళ పురుష పుంగవులు నీతిని అతిక్రమించినా గుంభనంగా చెయ్యాలని చాలా మంది నీతిబోధ. కథల్లో లైంగిక సంబంధాల గురించి రాయడం మైనస్ పాయింటు అంటారు కొందరు. అలా రాయని వాళ్ళు గొప్పవాళ్ళు అంటారు. తద్వారా వొక విక్టోరియన్ ప్యూరిటన్ నీతిని బోధిస్తారు. యీ విధంగా వలస క్రైస్తవాన్నీ, వారి పాప భావననీ, ఆ పాప భావననే అరువు తెచ్చుకున్న వీరేశలింగం లాంటి సంస్కర్తల్నీ, ఆ సంస్కర్తల్నే అనుకరించిన ప్రగతిశీల రచయితల్నీ ఆదర్శంగా భావిస్తారు. ఐతే యీ ప్యూరిటన్ నీతిని అమలు చేయడానికి ఫ్యాక్షనిస్టు భాషని, ఫ్యాక్షనిస్టు నీతినీ అరువు తెచ్చుకోవడం ద్వారా వొక కొత్త దుందుడుకు భాషని జత చేస్తారు.

ఇలాంటి వాళ్ళు అరువు తెచ్చుకున్న దుందుడుకు భాష ఆయుధమే కాని అది బలహీనులపై అమాయకులపై, పీడితులపై ఎక్కుపెట్టిన ఆయుధం. ఎవరు సమాజంలో పీడితులుగా వున్నారో, ఆ స్త్రీలే పీడకులుగా యెదగడాన్ని నామిని పంది వసంత పాత్ర ద్వారా నిరూపిస్తాడు. స్త్రీలు బడా వ్యాపార సంస్కృతిలో భాగమైపోవడాన్నీ, అందుకోసం తమ స్త్రీత్వాన్ని కూడా పణంగా పెట్టడాన్ని మూలింటామె నవలలో వర్ణిస్తాడు.

మనం Tamed Language మచ్చిక చేయబడ్డ భాష, పెంపుడు భాషల నుంచి బయటపడాలి. వెయ్యిపూలుగా వికసిస్తున్నామంటున్న అనేకమంది కవుల, రచయితల భాష సహజ వ్యక్తీకరణ కానేకాదు. అది స్కూళ్ళలోనూ, ఆఫీసుల్లోనూ, పత్రికా కార్యాలయాల్లోనూ నేర్పబడ్డున్న కృత్రిమభాష, కృత్రిమ స్వరం. పైగా అది తీవ్ర ఆధిపత్య స్వరం. దానికి వాహికలుగా జీవిస్తున్న బానిసకొక బానిసకొక బానిసకొక బానిస లాంటివాళ్ళే యీ వెయ్యిపూలు అని బుకాయిస్తున్న ప్రగతిశీల రచయితలు.

అసలు భాషని యెక్కడ నేర్చుకోవాలి? భారతదేశంలో భాష మౌఖికం, గ్రంథాలు మౌఖికం. కావ్యాలు మౌఖికం. అందుకే ముఖే ముఖే సరస్వతీ అన్నారు.

అందుకే శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు తాను అక్షరాలు రాయడం నేర్వని స్త్రీల కబుర్ల నుంచి భాషని నేర్చుకున్నాను అన్నారు. వివిధ వర్గాలు మాట్లాడే మాటల

నుంచి భాషనీ, వ్యాకరణాన్నీ నేర్చుకున్నాను అన్నారు శ్రీపాద వారు. ఆయనే యిచ్చిన ఉదాహరణ యిది.

పానకం పుచ్చుకోండి అనాలి

నీళ్ళు తాగండి అనాలి.

అదీ వ్యాకరణం. యిది నోటి భాష ద్వారానే అర్థమౌతుంది. కాని స్కూలు కెళ్ళి వ్యాకరణం నేర్చుకోవడం ద్వారా కాదు. నీళ్ళు పుచ్చుకోండి అని ఎవరూ మాట్లాడరు. అలా మాట్లాడితే అతడు తెలుగువాడే కాదు. నామిని పతనాలు చేశాడు అని అథమ రచయిత మాత్రమే రాయగలడు. పతనం సంభవించింది అని కర్మణి వాక్యంగానే రాయాలి. కర్తరి వాక్యంగా రాయడం అంటే మాతృభాషకి దూరమయ్యాడని అర్థం.

యిటీవల నేను తెలంగాణాకి వెళ్ళి కొందరు చిందు భాగవత కళాకారుల్ని కలిశాను. వాళ్ళు పదే పదే చెప్పిన మాట యేమిటో తెలుసా? 'అపశబ్దం పలుకరాదు' అని.

మాండలికంలో రాసినంత మాత్రాన అది సహజభాష కానేరదు. సామ్రాజ్యవాదం అన్నింటికంటె భాషని యెక్కువగా కబ్జా చేసింది. నీకు స్వతంత్ర తత్వం లేకపోతే స్వంతభాష యేర్పడదు. అందుకే నామినిలాంటి సహజ కవులు ఆంధ్రదేశంలో వొకరిద్దరే కనబడ్తారు. వేల మంది వుండరు.

వేదపఠనాన్ని కప్పల బెకబెకలతో పోలుస్తుంది రుక్‌వేదం. తెచ్చిపెట్టుకున్న స్వరం తెచ్చిపెట్టుకున్నట్లే వుంటుంది. ఆవు అంబా అన్నట్లు కోకిల కుహు కుహూ అన్నట్లు మూలింటామె పిల్లుల్ని 'చిన్నా మున్నుల్లారా, కానాచ్చుల్లారా, కొండాచ్చుల్లారా' అని పిలవడంలో ప్రకృతి సహజమైన వొక సహజలయ కనబడ్తుంది.

జార్ఖండు రాష్ట్రంలో ఊరిలోకి వచ్చిన ఏనుగుల్ని అడవిలోకి వెళ్ళమని వొక కోయ స్త్రీ ముండారీ భాషలో అభ్యర్థించింది. అవి ఆమె మాటని మన్నించాయి. అడవిలోకి వెళ్ళిపోయాయి. ఆమె పేరు నిర్మలాబొప్పా (24.6.2014 ఆంధ్రజ్యోతి)

యిటువంటి సహజత్వం నుంచి పతనం కావడం వల్లే 'పతనాలు చేశాడు' లాంటి అర్థరహితమైన వాక్యాల్ని రాస్తున్నారు కొందరు. కొన్ని పదాల కలయిక వాక్యం కాదు. అర్థవంతమైన పదాల కలయిక మాత్రమే వాక్యం అనిపించుకుంటుంది. అర్థం అంటే ప్రాపంచిక దృక్పథం.

అసలు పతనమంటే ఏమిటి ? ఒక ఉన్నత స్థితి నుంచి కింది స్థితికి పడిపోవడం. అది సంకల్ప పూర్వకంగా జరగదు. విధి వల్ల కాని, సామాజిక పరిస్థితుల వల్ల కాని, తెలియని యే తీవ్రశక్తులో పని చేయడం వల్ల మాత్రమే పతనం సంభవిస్తుంది.

పతనానికి మంచి ఉదాహరణ భర్తృహరి సుభాషితం.

ఆకాశంబున నుండి శంభుని శిరంబందుండి .....వివేకభ్రష్ట సంపాతముల్.

గంగ పతనమైంది, ఎక్కడి నుండి పతనమైంది? ఆకాశం నుండి శివుని శిరస్సు మీదికి, అక్కడి నుండి హిమాలయాలమీదికి, అక్కడి నుండి పాతాళంలోకి పతనమైపోయింది. మూలింటామె కొడుకు కూడా అలాగే పతనమయ్యాడు. కష్టపడి వ్యవసాయం చేసుకొనే స్థితి నుండి కష్టం లేకుండా నీడపట్టున వుండే స్థితికి సోమరి స్థితికి పతనమయ్యాడు. అందుకోసం అన్ని విలువల్నీ పణంగా పెట్టాడు. వ్యాపార తత్వంలో భాగమయ్యాడు.

అతడు చాలా మంచివాడు, నెమ్మదస్తుడు. కష్టజీవి, శ్రమ తప్ప మరేమీ తెలియనివాడు. ఎలా పతనమయ్యాడు? ఎందుకు పతనమయ్యాడు? గంగ ఎంతో పవిత్రమైనదీ స్వచ్ఛమైనదీ యీనాడు యింత కాలుష్యంలోకి ఎలా పతనమైంది? యిదీ అంతే.

గంగ వొక పరంపరా ప్రవాహం. కృషీవలుడైన మూలింటామె కొడుకు కూడా వ్యవసాయ జీవితమనే పరంపరకి చెందిన వాడే. గంగలాగే అతడూ పతనమయ్యాడు. వొక విధి వొక సామాజిక సాంస్కృతిక పరిణామం అంతే. యిదొక కర్మణి వాక్యం. యే వొక్కర్నీ తప్పు పట్టలేం.

పంది వసంతని కూడా పూర్తిగా తప్పు పట్టలేం. మారుతున్న పరిస్థితుల్లో ఆమె కూడా భాగం. ఆమె చేసిన తప్పేమిటి వ్యాపార తత్వాన్ని గ్రామానికి తెచ్చి డబ్బులు సంపాదించుకునే మనస్తత్వాన్ని పెంచడమా? దానిలో భాగమే పెరట్లో మూలింటామె (ప్రేమగా కొడుకూ – మనవరాళ్ళు విహరించడం కోసం) పెంచిన తోటని కొట్టేసి కలపగా అమ్మెయ్యడం. వివాహేతర సంబంధాలు కూడా ప్రయోజన దృష్టితోనే, వ్యాపార దృష్టితోనే.

యిందుకోసం ఆమెని మనం విమర్శిస్తే మీరు పెద్ద పత్తిత్తులా? అని నామిని మననే నిలదీస్తాడు. ఆమె యిరవయ్యేళ్ళ ఆడపిల్ల. చెప్పిచ్చుకొని కొట్టి దార్లో పెట్టచ్చు

అని ఎవరైనా విమర్శకుడు అన్నాడనుకోండి. నువ్వెవడివి ఆమెని చెప్పిచ్చుకు కొట్టడానికి, నువ్వేమైనా పత్తిత్తువా అని నిలదీస్తాడు నామిని సుబ్రహ్మణ్యం నాయుడు. లంజరికం చేసినా గుంభనంగా చెయ్యాలి. పబ్లిగ్గా పక్కలు పరవకూడదు. మనం మొగాళ్ళం కాబట్టి ఎవరితోనైనా సంబంధాలు పెట్టుకోవచ్చు. కాని భార్యల్ని బరితెగించనివ్వచ్చా? 'మూలింటామె మనవరాలు ఎందుకు లేచిపోయింది. మొగుడు చేతగానివాడు కాబట్టి లేచిపోయింది అనేది అసలు పాయింటు', అని వికృత సాహిత్య పరామర్శ చేసేది పురుషాధిపత్య పూరితుడు మాత్రమే.

నామిని తనని అనుకరిస్తూ పిల్ల మేఘు సందేశాలు రాసే శిష్యులకి అందనంత యెత్తుకు యెదిగిపోయాడు మూలింటామెతో.

మూలింటామె నవలలో భాష కంటె మౌనం వహించిన పాత్ర గొప్పది. ముఖ్యంగా మూలింటామె మౌనం.

మౌనం కూడా వ్యాఖ్యానమే. 'మౌనవ్యాఖ్యా ప్రకటిత పరబ్రహ్మ తత్వం' అన్నారు శంకరాచార్యులు. మౌనం గొప్ప వ్యాఖ్యానం. మౌనం కంటె గొప్ప నిరసన లేదు. మౌనం కంటె గొప్ప తిరుగుబాటు లేదు. మూలింటామె చేసిందదే. మౌనం వహించడం. మూర్తీభవించిన మార్కెట్టు శక్తిలా యింట్లోకి చొచ్చుకొచ్చిన పంది వసంతని మౌనంతో తిరస్కరించడం. పంది వసంత కృత్రిమ ప్రేమని, కలగలుపు తనాన్ని, నవ్వుల్నీ, పరాచికాల్నీ, ఆకర్షణీయమైన ప్రతిదాన్నీ మౌనంతో తిరస్కరించడం, ఉదాసీనతతో తిరస్కరించడం.

ఉదాసీనో మహాబలః ఉదాసీనంగా ఉండే వాడి కన్న బలవంతుడు లేడు. సమాజంలో ఉదాసీనత పెరిగితే మార్కెట్టు వ్యవస్థ కూలిపోతుంది. వొక దళారీ పశ్చాత్తాపం అనే గ్రంథంలో పశ్చాత్తాపం చెందిన ఆమెరికన్ దళారీ యిదే మాట చెప్పాడు. కాస్తంత మౌనాన్నీ, ధ్యానాన్నీ ఆశ్రయించండి. మార్కెట్టు సరుకుల సంస్కృతికి యిదే సమాధానమన్నాడు. విశ్వనాథ సత్యనారాయణ వేయి పడగలలో కూడా ధర్మారావు పాత్రలో మౌన నిరసన కనబడ్తుంది. మూలింటామె తన యింటిలోకి పంది వసంతని ప్రవేశపెట్టిన అక్కయ్యని కూడా అడుగడుగునా తిరస్కరిస్తుంది. ప్రతీ దైనందిక చర్యలోనూ యీ నిరసన బయటపడ్తుంది.

యుగం మారిపోతున్న సంధి దశలో మూలింటామె మౌనంగానే నిష్క్రమిస్తుంది శ్రీకృష్ణుడిలానే.

మాటల్ని కాక మౌనాన్ని ఆశ్రయించడంలో నామిని తాత్విక గాఢత్వం బయటపడ్తుంది. మౌనంలో విషాదమూ ఉంది, నిరసన కూడా వుంది.

'మౌనం శ్మశానం అది కాదు సమాధానం' అన్నాడు శ్రీశ్రీ. అందుకే అంతర్గత ఘర్షణకీ వేదనకీ సాహిత్యంలో తక్కువ స్థానం యివ్వబడింది. కమ్యూనిస్టులు భాషకి మితిమీరిన ప్రాధాన్యమిచ్చి మౌనాన్ని తిరస్కరించడం వల్ల వచ్చిన ముప్పు యిది. నీవు అంతర్ముఖుడివి కాకపోతే బయట వున్నది కూడా నీకు అర్థం కాదు. మూలింటామె చెప్పిన సత్యం అదే.

వాహనాల రద్దీ, ప్రసారసాధనాలు, సరుకులు సృష్టించే మాయాజాలం, వీటి మధ్య కాస్తంత మౌనం, ధ్యానం అనేవి అందుబాటులో లేని వస్తువులు. వాటిని మళ్ళీ సాహిత్యంలోకి తీసుకు వచ్చాడు నామిని.

నేను మళ్ళీ మొదటికొచ్చి ప్రశ్నిస్తున్నాను? మూలింటామె మౌన నిరసననే యెందుకు తెలియజేసింది? పిల్లులతో తప్ప ఆమె మనుషులతో మాట్లాడలేదా? నేను ఉదహరించిన కోయ స్త్రీ ఏనుగులతో మాట్లాడినట్లు యీమె పిల్లులతోనే మాట్లాడ్తుందా? పిల్లులకి అర్థమైన భాష మనుషులకి ఎందుకు అర్థం కాదు?

ఎందువల్లనంటే వాళ్ళు మనుషులు కనుక. మార్కెట్టు వ్యవస్థలో భాగమైపోతూ, తమ సహజ అభిరుచుల్నీ రాగద్వేషాల్నీ, వ్యక్తీకరణల్నీ, హావభావాల్నీ డబ్బు సంపాదనకోసం ప్రాగ్మాటిస్టు దృక్పథంతో కృత్రిమత్వంలోకి మెలితిప్పుతున్న ఆధునిక మానవులు కనుక వారికి గత తరానికి చెందిన మూలింటామె మాటలు అర్థంకావు.

చెట్లు కొట్టెయ్యకపోతే కలప యెలా వస్తుంది? అందమైన అధునాతన గృహాల నిర్మాణం యెలా సాధ్యం? వడ్డీవ్యాపారం చెయ్యకపోతే తీవ్రంగా డబ్బు చలామణీ, దానివల్ల వచ్చే సరుకుల మారకం ఎలా సాధ్యమవుతుంది? 'రుణం కృత్వా ఘృతం పిబేత్', అప్పు చేసి పప్పు కూడు తినమన్న చార్వాకుణ్ణి ప్రాచీనులు నిందించారు కాని అప్పు లేకపోతే ఆధునిక మార్కెట్టు వ్యవస్థ వొక్క అడుగు ముందుకు వెయ్యలేదు. అప్పుని వసూలు చెయ్యడం కోసం పంది వసంతలా కఠినంగా వుండక తప్పదు. అందుకే ఆమె ప్రవర్తనని గ్రామీణులు అర్థం చేసుకుంటారు. పొలాన్ని అమ్మేసి వ్యాపారంలోకి దిగినట్లే, అవసరం తీరిపోయిన మనుషుల్ని వదిలేసి, కొత్త పురుషుల్ని చేరదియ్యడమూ మార్కెట్ వ్యవస్థలో మామూలే. ప్రయోజనమే సత్యమైన చోట యిదంతా మామూలు విషయమే. ఆ పొలాన్ని అమ్మేయకపోతే మూలింటామె కొడుకు

నీడపట్టున హాయిగా వుండగలడా? మోపెడ్ మీద తిరగగలడా? యిది పంది వసంత లోనూ ఆమెని అంటిపెట్టుకున్న గ్రామ ప్రజల్లోనూ వచ్చిన మార్పు.

యీ మొత్తం మార్పుని మూలింటామె యెలా వ్యతిరేకించగలదు? యెలా కత్తి దుయ్యగలదు? ఎలా నిలువరించగలదు? దీనిలో వ్యక్తులు పావులు మాత్రమే. మొత్తం వ్యవస్థలో వస్తున్న మార్పు యిది.

దీన్ని వ్యతిరేకించి మూలింటామె మాట్లాడినా అది కమ్యూనికేట్ కాదు. పిల్లులలో యే వికృత మార్పూ లేకపోవడం వల్ల వాటితో మాత్రమే మూలింటామె సంభాషించగలదు. అందువల్లనే పంది వసంత పిల్లుల్ని చంపెయ్యడంతో, పూర్తి వంటరైపోయిన మూలింటామె చనిపోతుంది. మూలింటామె బయోగ్రఫీ ఈజ్ ఓవర్.

కాని మూలింటామె కోసం యేడ్చే వాళ్ళెవరు? తాము యెంతగా నవ్వుతూ పలకరించినా చేరదీసినా ముఖం తిప్పుకున్న మూలింటామె కోసం పంది వసంత ఎందుకు ఏడుస్తుంది? ఆమె ప్రియుడు ఎందుకు ఏడుస్తాడు? వారిలో చేరిపోయిన కొడుకు ఎందుకు ఏడుస్తాడు? పిల్లులతో సంభాషిస్తూ పరమ అప్రయోజకంగా జీవించిన మూలింటామె కోసం కూడా కన్నీళ్ళు కార్చే వాళ్ళు వున్నారా? వుంది ఆమె మనవరాలు. అరవ మాదిగోడితో లేచిపోయిన మనవరాలు. ఆమె కూడా నిశిరాత్రి చీకట్లో రోదిస్తుంది, పాతిపెట్టిన చోట పడిపడి యేడుస్తుంది. యిక్కడ హృదయహీనుడు మాత్రమే ఔచిత్యం లోపించిందంటాడు. (వొక కథలో ప్రియుడు శవంపై పడి రోదించిన స్త్రీ గురించి రాస్తే అధమ విమర్శకుడొకడు వెక్కిరించాడని చలం రాశాడు). అసలు ఆమె మాదిగోడితో లేచిపోవడం లోనే ఔచిత్యం లేదని, మొగుడి చేతగానితనం వల్లనే లేచిపోయిందని కార్యకారణ సంబంధాన్ని చూపడం మూర్ఖత్వం.

ఎందుకు లేచిపోయిందని అడగడమే అనౌచిత్యం. అది నామినికి మాత్రం తెలుసా? మనుషుల్ని కాని, ప్రపంచాన్ని కాని మొత్తంగా చదివెయ్యగలమని, సకల మార్మికతల్ని హేతువుతో ఛేదించెయ్యగలమనీ అహంకారం గల ఆధునికులు మాత్రమే యిటువంటి ప్రశ్నలు వెయ్యగలరు.

మూలింటామె మనవరాలి గురించి యెవరేమనుకుంటున్నారో చెప్పడం మాత్రమే రచయిత చేస్తాడు. దానిలో వాస్తవ అవాస్తవాలు ఎవరికి తెలుసు? అసలు స్పష్టమైన వాస్తవం అంటూ వుందా?

జగత్తు సత్యమా, జగత్తు అసత్యమా, బైటి వస్తువులని నేను చూస్తున్నానా? లేక చూస్తున్నాననే జ్ఞానాన్నే చూడడంగా భావిస్తున్నానా? నా రాగద్వేషాలకీ, మూడ్స్‌కీ అతీతంగా పూర్తి ఆబ్జెక్టివ్ ప్రపంచం సాక్షాత్కరిస్తుందా, అది సాధ్యమా? యిలాంటి అతి మౌలిక ప్రశ్నల చుట్టూ తిరిగే తత్వశాస్త్ర గ్రంథాలని అధ్యయనం చెయ్యడంలో మునిగిపోయాను నేను. మధ్యలో యీ నవల చదివాను.

నామిని మూలింటామె మనవరాల్ని ఒక మంచుతెర వెనక నిలిపి వేశాడు. ఆమె గురించి, ఆమె మాటల గురించి, ఆమె ప్రవర్తన గురించి ఊరిలోని వాళ్ళూ, చీమంతమ్మ అనే సహృదయురాలూ, మాలగురివి, మూలింటామె చేసే వ్యాఖ్యానాలూ ఆలోచనలే తప్ప ఆమె మనకి యెక్కడా ప్రత్యక్షంగా కనబడదు.

ఐతే ఒకటి మాత్రం సత్యం. మూలింటామె మనవరాలు లేచిపోయింది. తక్కువ కులం వాడితో లేచిపోయింది. కులవృత్తులు ధ్వంసమైపోయి కుల సంస్కృతులు అడుగంటిపోయి కులం నామమాత్రంగా మిగిలిపోతున్న మాట నిజమే కాని అది హెచ్చుతగ్గుల అంతస్తుల్ని మాత్రం కొనసాగిస్తోంది. యీ హిపోక్రసీని నామిని ఉతికి ఆరేశాడు. యిందుకోసం తన కులాన్నే యెంచుకోవడం అతని విజ్ఞత. యిటీవల గుంటూరులో వొక కమ్మ పెద్దమనిషి మిత్ర బృందం మధ్య వొక ప్రతిపాదన చేశాడు. శ్రామికకులాలు ప్రజాస్వామికంగా వుంటాయని, సంప్రదాయాల పేరుతో పితృస్వామ్యాన్ని బలంగా అమలు పరచవని ఆయన వాదించాడు. మావగారు వస్తున్నా తమ యింట్లో ఆడవాళ్ళు లేచి నిలబడే వారు కాదని, అదే బ్రాహ్మణుల యిళ్ళల్లో స్త్రీలపై సంప్రదాయం పేరుతో తీవ్రమైన అదుపు ఉంటుందని అన్నాడు. యిక్కడ శ్రామిక కులం అంటే కమ్మవారు అని ఆయన భావం.

యీ వాదన ఆయన చేసిన కొంత కాలానికే గుంటూరు జిల్లాలోనే వొక పరువు హత్య జరిగింది. వొక కమ్మ దంపతులు తక్కువ కులం వాణ్ణి పెళ్ళి చేసుకుందన్న కారణంతో తమ కూతురినే వురివేసి చంపేశారు. ఆ కుర్రాడు కులం తక్కువ వాడైనా బాగా చదువుకున్న వాడు, విదేశాల్లో వుద్యోగం చేస్తున్న వాడు.

అందుకే అరుణ చాలా కాలం క్రితమే 'ఎల్లి' నవలలో ఎరుకలలో కూడా బలంగా వున్న పురుషాధిపత్యాన్ని స్పష్టం చేసింది. యిప్పుడు నామిని అనే పుడింగి తన కులాన్నే నిలదీస్తున్నాడు. లౌక్యులు పెద్దల పక్షాన నిలబడ్తారు. కవులు వ్యవస్థకే ప్రతి వ్యవస్థగా తయారవుతారు.

సుకుమార్ అనే కుర్రాడు మీలో లంజరికం చెయ్యని వాళ్ళెవరు అని నిలదీస్తాడు. ఇది నైతికమైన ప్రశ్నకాదు, వాస్తవికమైన ప్రశ్న.

వివాహ వ్యవస్థ సగం సన్యాసం లాంటిది. సంతానం కోసం, ఆస్తి కొనసాగింపు కోసం నాగరికత ఆకర్షణల్ని బలిపెట్టింది. కాని కుటుంబ వ్యవస్థ చాటు నుంచి బలమైన ఆకర్షణలు తమ పాశవిక శక్తితో అదుపులేకుండా విజృంభిస్తూనే వుంటాయి. అవి కుటుంబాన్ని సవాలు చేస్తూనే వుంటాయి. కాని కుటుంబ వ్యవస్థ అంతం కాదు. యెందుకంటె కుటుంబ వ్యవస్థ కూడా పశు సహజమైన భద్రతా భావం నుంచి, బొరియలో తలదూర్చుకునే జీవ స్వభావం నుంచి ఆవిర్భవించిందే

యీ నవలలో సుకుమార్ సూటిగా ప్రశ్నించే స్వభావం కలవాడుగా కనిపిస్తాడు. ఎవరూ ఎందుకు మాట్లాడరు! పంది వసంతని యెందుకు నిలదియ్యరు, ప్రతిఘటించరు? అని ప్రశ్నించే వాళ్ళకి సుకుమార్ సమాధానంగా కనబడ్తాడు. నిశ్శబ్దాన్ని ఛేదించే విస్ఫోటనంలా కనబడ్తాడు.

కాని మొత్తంగా చూసినపుడు అతని పాత్ర చాలా స్వల్పం. ముఖ్యంగా సుకుమార్ ఊరిలోని వాళ్ళు మూలింటామె మనవరాలు లేచిపోవడం గురించి పంచాయితీ చేసినపుడు వారిని నిలదీస్తాడు. మీలో లంజరికం చెయ్యని వాళ్ళెవరని ప్రశ్నిస్తాడు. దాంతో పంచాయితీ రసాభాస అవుతుంది.

కాని పంది వసంతని సుకుమార్ ప్రశ్నించడు. ఎందుకంటె పంది వసంత లోని ప్రయోజన తత్పరతకీ, స్వార్థబుద్ధికీ మనస్ఫూర్తిగా ఆహ్వానం పలకగల కుటిల మనస్తత్వం ఆ వూరి జనంలో వుండడం వల్లనే పంది వసంత ప్రవేశం సులభమైంది. అందువల్ల పంది వసంత ప్రశ్నలకి అతీతురాలిగా మారిపోయింది.

మౌనస్వభావం కల పాత్రలూ, చప్పుడు చెయ్యని పాత్రలూ మూడు కనబడ్తాయి. మూలింటామె, ఆమె మనవరాలు, నారాయణస్వామి. నారాయణస్వామి పతనానికి చిహ్నంగా మిగుల్తాడు.

కాని గొంతులేని ఆడవాళ్ళ తరపున గొంతు చించుకున్న వాడుగా సుకుమార్ మిగిలిపోతాడు. శబ్దానికి వొక ప్రయోజనాన్ని చేకూరుస్తాడు నామినిలాగే.

ఆధునికత తీసుకువచ్చిన రణగొణ ధ్వని, మాటకారితనం, వ్యక్తిత్వ వికాసం, దూసుకుపోయే స్వభావం, లౌక్యంతో యెలాగైనా పనుల్ని చక్కబెట్టడం యిలాంటి వాటి ద్వారా ప్రాచీన గ్రామీణ మౌనాన్ని ధ్వంసం చేసి వేస్తుంది పంది వసంత.

అంత క్రితం గ్రామాల్లో కుటుంబమూ వుంది, వివాహేతర సంబంధాలూ వున్నాయి. యీ రెంటిలో దేన్నీ తిరస్కరించకుండా, రెండింటికీ లౌక్యంగా సమన్వయం చేసి, సంధి కుదిర్చి వ్యాపార ప్రయోజనాలకి వేదికలుగా మార్చేస్తుంది పంది వసంత. దీంతో వివాహమూ, వివాహేతర సంబంధమూ రెండూ కూడా సహజత్వాన్ని కోల్పోయి కాగితంపూలుగా మిగిలిపోతాయి. కోడికూర తన సహజ రుచిని కోల్పోతుంది. అందుకే మూలింటామె పంది వసంత పెట్టిన కోడికూరని తిరస్కరిస్తుంది.

యిది మూలింటామె చేసిన సత్యాగ్రహం. నామిని కోడికూర వర్ణనని సాగదీయలేదు. ఆ వర్ణన నాబోటి వైదిక బ్రాహ్మణుడిని కూడా నోరూరించేలా చేసింది. బసవపురాణంలో కోడిపుంజు వర్ణన యెంత గొప్పగా, కళ్ళకు కట్టినట్లు వుంటుందో మిత్రులు సుబ్రహ్మణ్యం గారు చదివి వినిపించారు. నామిని కోడికూర వర్ణన దానికి తీసిపోయేది కాదు. పైగా కోడికూర యీ కథలో పూర్తిగా యిమిడిపోతుంది. కోడికూర కూడా పాత్రగా మారిపోయి, కథని నడిపిస్తుంది. కోడికూర వాసన యెలా గాలిలో తేలుతూ వెళ్ళి, పంది వసంత రెడ్ల సంబంధాన్ని బట్టబయలు చేస్తోందో కవి వర్ణన చదివి తీరాల్సిందే. కాని ఆ సంబంధం వెనక యెంతో వ్యాపార ప్రయోజనం వుంది కనుక ఊళ్లో చాలామంది అంగీకరించడమే కాదు ఆహ్వానిస్తారు.

రెడ్డి తగవు, కమ్మ తగవు రెడ్డు తీర్తురు గుట్టుగా అన్నాడు శ్రీశ్రీ. రెడ్డి కమ్మ తగవు చాలా పాతది. యీ తగవుని పంది వసంత పరిష్కరించేస్తుంది. వ్యాపార ప్రయోజనాల ముందు కుల వ్యత్యాసాలు పనికిరావని 'తొంభైయేళ్ళ' సంబంధం పెట్టుకుంటుంది.

అది తెలుగుదేశం పార్టీ మొదలైన కాలం. నారాయణస్వామి తమ్ముడు రంగబిళ్ళ తెలుగుదేశం పార్టీ వాడే. అతనితో సంబంధాన్ని రెడ్డి కోసం తెంచేసుకుంటుంది. రెడ్డి కోసం కాదు రెడ్డి వల్ల వచ్చే ప్రయోజనాల కోసం. రంగబిళ్ళ ఆత్మహత్య చేసుకుని చనిపోతాడు. కులాభిమానం కూడా దిక్కులేని చావు చస్తుంది. వ్యాపారమే అసలు కులం. యీ సత్యాన్ని చాటింది కమ్మవారే.

కమ్మ కులస్తులు యూదులని పోలినవారు. వ్యాపారమూ, విద్యా రెండూ వారిలో కలగలిసి పోయాయి. వారు మొట్టమొదట యెదుర్కొన్నది బ్రాహ్మల్ని. కాని వారిలో యిప్పుడు బ్రాహ్మణ ద్వేషమూ మిగిలిలేదు. బ్రాహ్మణ లక్షణాల్ని తాము కూడా సంతరించుకొని, వాటిని కూడా వ్యాపారంలో లయం చేశారు.

ముఖ్యంగా జ్ఞానాన్ని వ్యాపారంగా మార్చారు. మీడియా లోనూ విద్యా వ్యాపారంలోనూ ఆరితేరారు.

రెడ్లకి యీ లక్షణం లేదు. వ్యాపారం అంటే వస్తువుల్ని అమ్మడం కాదు బుర్రల్ని తాకట్టు పెట్టడం అనేది పంది వసంతకి తెలుసు కాని రెడ్డికి తెలియదు. అందుకే రెడ్డిని పంది వసంత వాడుకోగలదు కాని, పంది వసంతని రెడ్డి వాడుకోలేడు.

యింతకీ నామినితో కాని, నామిని రచనతో కాని నాకేమిపని? నేను బ్రాహ్మణుణ్ణి, అతడు కమ్మవాడు. అతని రచనని నేను యెందుకు యిష్టపడ్తానంటే నేను విశ్వనరుణ్ణి అని నామిని చెప్పలేదు . నేను కమ్మవాణ్ణి అని చెప్పాడు. అందుకే దళితుల జీవితం నేను రాయలేను అన్నాడు.

'నామిని పెద్ద పుడింగి' పేరుతో వొక పుస్తకం వచ్చిందని, దానిలోని వొక భాగం ఆంధ్రజ్యోతిలో వచ్చింది చదవమని ఒక రోజు ఫోను చేశాడు నరహరి. దానిలో తను ఎంతగానో అభిమానించి, ముఖ్యపాత్రగా చేసి కథలు రాసిన తల్లినే నామిని విమర్శించాడు. తన తల్లి దళితుల పట్ల చిన్నచూపు కలిగి వుండేదని రాశాడు. అలాగే తన కులం వాళ్ళు దళితుల పట్ల యెంత వివక్షతో ప్రవర్తించారో రాశాడు.

మనుషులలోని మంచితనాన్నీ సెంటిమెంట్సునీ మాత్రమే కాదు. వారిలోని నెగిటివ్ సైడ్‌ని కూడా చూపడం కవుల బాధ్యత అని నామిని భావించాడు. అందుకోసం వేరే కులం వాళ్లని కాక తన కులాన్నే యెంచుకున్నాడు. దీని ద్వారా బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమకారుడు త్రిపురనేని రామస్వామి చౌదరికి పూర్తి భిన్నంగా ప్రవర్తించాడు.

ఆధునిక ప్రగతిశీల సిద్ధాంతాలూ, దళిత, స్త్రీ వాదాలూ వొక్క అంగుళం కూడా కదలని యీ కాలంలో చాలా ముందు చూపుతో వ్యవహరించాడు నామిని.

అరుంధతీరాయ్ యిటీవల అంబేద్కర్ 'అనిహిలేషన్ ఆఫ్ కాస్ట్'కి ముందు మాట రాసింది. దానిలో ఆమె రాసిందేమిటంటే – వొక కులాన్ని మరొక కులం చివరికి మాలవాళ్ళు మాదిగల్నీ, వాళ్ళు డక్కలి వాళ్లనీ చిన్నచూపు చూస్తున్నారని రాసింది. అంతేకాదు దళితులు రాజ్యాధికారానికి అర్హులు కారన్న గాంధీని విమర్శించిన అంబేద్కర్, గిరిజనుల గురించి అటువంటి మాటలే రాశాడని విమర్శించింది. పైగా అంబేద్కర్ లాంటి వాళ్ళకి బిగ్ ప్రాజెక్టులపైన నగరాలపైన ఉన్న మోజు

పర్యావరణానికీ, సామాన్య జనుల జీవిత భద్రతకీ ముప్పుగా పరిణమించిందని రాయడానికి సాహసించింది.

మనకి మంచీ-చెడూ, వెలుగూ-చీకటీ.... యిలా స్పష్టమైన విభజన కావాలి వెలుగులోని చీకటినీ, మంచిలోని చెడునీ చూసే సాహసం చాలామందికి లేదు. అది నామినికి వుంది. మొదట్లో లేకపోయినా నేడు ఏర్పడింది. అదే నామినిని సమకాలీనుల కన్న భిన్నంగా నిలిపింది. కమ్మ కులంలో కూడా ప్రతి పక్షంగా నిలిపింది. మహాభారతంలా, రాగద్వేషాలకీ, మంచి చెడులకీ, అమాయకత్వ, కుత్సితాలకీ నిలయాలైన గ్రామాల్ని నగరీకరణ యాంత్రీకరణ సమూలంగా పెకలించివేస్తున్న బీభత్సదృశ్యాన్ని ధ్వనిపూర్వకంగా వర్ణించాడు నామిని. ప్రపంచం కుగ్రామమైపోతున్న తరుణంలో గ్రామం, గ్రామీణత కనుమరుగైపోవడాన్ని కళ్ళకు కట్టాడు.

ఆ క్రమంలో నామిని గ్రామాన్ని ఆదర్శీకరించలేదు, పట్టణాల్ని కీర్తించలేదు. వొక సంధి దశలో నిలిచిపోయాడు. యిది వొక కమ్మ కవికుండే వాస్తవిక దృక్పథం. ఎందుకంటె అతడు గ్రామంలో భాగమై జీవించాడు. దాని గురించి పూర్తి వాస్తవం అతనికి తెలుసు. అందుకే అతడు గ్రామాన్ని గురించి అతిశయోక్తులు రాయలేదు.

మాక్స్‌ముల్లర్ భారతదేశాన్ని ఎప్పుడూ సందర్శించలేదని, అందుకే దాన్ని ఆధ్యాత్మిక స్వర్గంగా స్వప్నించాడని అంటారు. గ్రామాన్ని గురించి బ్రాహ్మణులూ వైశ్యులూ కలగన్నట్లు శూద్రుడు కలగనలేడనుకొంటాను. ఎందుకంటే అతడు ఆ మట్టిని పిసికి పంటలు పండించినవాడు. గాంధీ వైశ్యుడు కావడం వల్లనే ప్రాచీన గ్రామాల స్వర్ణయుగం గురించి కలగన్నాడా? రైతులని గురించి సెంటిమెంట్సు నుంచి రచయితలు బయటపడాలని నామిని నాతో స్వయంగా చెప్పాడు.

ఐతే నామిని వేళ్ళు గ్రామంలోనే వున్నాయి. అతనితో ఫోనులో మాట్లాడడం పెద్ద సమస్య నాకు. ఆ మొరటు చిత్తూరు జిల్లా కమ్మ రైతు గొంతుని, ఆ గ్రామీణ స్వరాన్ని సెల్‌ఫోను పరిహసిస్తోందా అనిపిస్తుంది. అతడు జర్నలిస్టుగా పని చేసి వుండవచ్చు. అది అతని స్వరంలో చిన్న ఆధునిక మార్పుని కూడా తీసుకురాలేక పోయింది. నేను ఫోనులో బిగ్గరగా మొరటుగా మాట్లాడతానని మా ఆవిడ అంటూ వుంటుంది. ఫోన్ మేనర్స్ నేర్చుకోమంటూ వుంటుంది. యింక నామిని సంగతి

చెప్పేదేముంది. అది మరింత మెరటు పల్లెటూరి బైతు గొంతు. సరిగ్గా అదే అతని ఆకర్షణ. అతని భాషలోని ఆకర్షణ.

కేమూ, దోస్తవిస్కీ లాంటి పాశ్చాత్య రచయితలు నగరాలలో పరాయీకరణ చెందిన పాత్రల్ని సృష్టించారు. దిక్కులేకుండా చరిస్తున్న ఒంటరి పాత్రల్ని సృష్టించారు. నామిని గ్రామాల్లో అటువంటి పాత్రల్ని కనుగొన్నాడు.

అటువంటి మానసిక ఘర్షణని, స్వగతాలని గ్రామీణ పాత్రల్లో ఫక్తు గ్రామీణ భాషలో, యాసలో వ్యక్తం చేశాడు. యిదెలా సాధ్యమైంది. గ్రామాలు నగరాలుగా మారిపోయాయా? సుదూర నగరాలు గ్రామాల్ని కొండచిలువల్లా మింగేశాయా? చాలా కాలంగా మావోయిస్టులు ప్రచారం చేస్తున్న అర్థ వలస అర్థభూస్వామ్య వ్యవస్థ సిద్ధాంతాలు వట్టి పోయాయా? పెట్టుబడిదారీ యుగం, నగరీకరణ క్రమం వేగవంతమైందా? దానిలో నుంచి వచ్చిన విచ్ఛిత్తే యిటువంటి అంతర్గత ఘర్షణతో కూడిన పాత్రల చిత్రీకరణకి మూలమా? ఔననే అనిపిస్తుంది. (పల్లెను మింగిన పెట్టుబడి – విద్యాసాగర్ పుస్తకం గుర్తొస్తోంది).

మధ్యతరగతి, పట్టణ వాసుల విషయంలో మాత్రమే తీవ్ర మానసిక ఘర్షణలూ, స్వగతాలతో కూడిన చిత్రణ జరిగింది. మానసిక చిత్రీకరణ బలంగా జరిగింది. గ్రామీణుల గురించి యిటువంటి నవలలు ఉన్నాయో లేదో కూడా తెలియదు. కనీసం అరుదు. యింత లోతైన కావ్యం దుర్లభం. అందువల్లనే యీ నవల విస్తృతి యెక్కువ.

ఆధునిక మార్పుల ప్రభావాన్ని గురించి వర్ణిస్తూ నామిని పేదరికాన్ని పక్కన బెట్టాడు. ఆధునికత, యాంత్రీకరణ తీసుకువచ్చే మానసిక శూన్యత గురించి, సహజ సంభాషణలని అసాధ్యం చేసే విధ్వంసం గురించి మాట్లాడ్తాడు నామిని.

కాముకత్వాన్ని చీకటిగా భావిస్తారు మూర్ఖులు. నిజానికి కాముకత్వం యెప్పుడూ చీకటి కాదు, వ్యాపారలక్షణాలు మితిమీరి పోవడంతో గొప్ప వెలుగునిచ్చే సహజ ఆనందాన్నిచ్చే కాముకత్వం అసాధ్యమౌతుంది. కాముకత్వం కూడా యాంత్రీకరించబడ్తుంది యిటువంటి కృత్రిమ కాముకత్వాన్ని బట్టబయలు చేస్తూ ఆధునిక వ్యవస్థపై తీవ్రదాడి చేస్తాడు నామిని. కవిత్వంలా వెన్నెలలా సహజంగా ఉప్పొంగి వచ్చే కాముకత్వం అందని ద్రాక్షపండే అని నిరూపిస్తాడు. ఆధునిక యుగం నపుంసక యుగం అని నిరూపిస్తాడు.

బాహిరమైన దివాళాతనం గురించి కాక అంతరంగంలో దివాళా తీయడం గురించి మూలింటామె నిరూపిస్తుంది. అందుకే యిందులో పేదరికం కనబడదు. మానసిక పేదరికమే కనబడ్తుంది. యింకా చెప్పాలంటే పంది వసంత గ్రామ ప్రవేశంతో డబ్బు చలామణీ పెరిగి జీవితం సుఖవంతమౌతుంది. నారాయణ స్వామికి మోపెడ్ వాహనయోగం దక్కి కాళ్ళ పగుళ్ళు మానిపోతాయి. వొక రైతుకి కాళ్ళలో పగుళ్ళు పోయి, అతని పాదాలు సున్నితంగా మారిపోవడం వ్యవస్థలో పెద్ద మార్పు.

అంతా బాగానే వుంది కదా యింక బాధపడాల్సిందేముంది? ఎవరు మాత్రం సోమరి సుఖమయజీవితాన్ని కోరుకోరు?

యిప్పుడే బస్సు ప్రయాణంలో వుండగా ఫోను చేసి మృత్యుంజయరావు గారు 'చూశారా పంది వసంతకి నెలతక్కువ పిల్లాడు పుట్టాడు' అన్నారు. ఔను దీనర్థమేమిటి?

సమాజంలో సహజమైన నవ్వులు, సహజమైన సంభాషణలు, సహజమైన ఏడుపులు, సహజమైన భాష అడుగంటిపోవడం నాగరికత కోరే బలి తర్పణ అని నామిని నిరూపించాడు. ముఖ్యంగా సహజమైన పరిణతితో కూడిన కామం, పరిణతితో కూడిన పుట్టుక, పరిణతితో కూడిన చావు లేకపోవడం. మరి పంది వసంతకి నెల తక్కువ పిల్లాడు పుట్టాడు. అవసరార్థం బంధాలే తప్ప, క్షణిక బంధాలే తప్ప, సహజ రాగానుబంధాలు అడుగంటిపోయాయి. రంగబిళ్ళ మరణంతో స్త్రీ పురుష సంబంధాలలోని అమాయకత్వం ఏ కోశానైనా మిగిలి వుంటే కొడిగట్టుకుపోయింది.

ముఖ్యంగా అమాయకత్వం, మూలింటామెలో, ఆమె మనవరాలిలో, పిల్లులలో దాగిన సహజ అమాయకత్వం. అది బలైపోయింది. తన మనవరాలు కులం తక్కువ వాడితో లేచిపోయినా, అక్కడైనా సుఖంగా వుండాలని ఆశించే అమ్మమ్మ అమాయకత్వం లాంటిది అడుగంటిపోయింది. అగ్రకుల దురహంకారం వ్యాపారతత్వంతో మిళితమై అంతరంగంలో దివాళాకోరుతనాన్ని మిగిల్చింది.

నామిని 'మరో చలం' కానందుకు మనం సంతోషించాలి. ప్రేమని గురించి కాకుండా కామాన్ని గురించి అదుపుతప్పి రాసినందుకు అభినందించాలి. ఎందుకంటె యిప్పుడు కామం కూడా మిగిలిలేదు. అసలు దేహాలు మిగిలిలేవు. మార్కెట్ సరుకుల మాయాజాలం మాత్రమే మిగిలింది. అందుకే మూలింటామె యిల్లు అంగడి యిల్లుగా పేరు మార్చుకుంది.

యిల్లు, దేహమూ రెండూ వొకటే. యిల్లు సరుకుల మాయాజాలంగా యెప్పుడు మారిపోయిందో దేహం కూడా సరుకుగా మారిపోయింది. దాని ఫలితమే అమాయకత్వం నశించిపోవడం; మాటకారితనం మితిమీరి పోవడం, లయబద్ధం కాని దేహాల కృత్రిమ కదలికే కామంగా చలామణీ కావడం.

నామిని మానవ జీవితంలోని చీకటి పార్శ్వంపై మాత్రమే ఫోకస్ చేస్తున్నాడా? నేనీ మధ్య ఫోనులో మాట్లాడినపుడు రైతు జీవితం గురించి ప్రచారంలో వున్న సెంటిమెంట్సుని ఖండించాడు. ఈర్ష్యాసూయలు, కుత్సితాలూ గ్రామాల్లో కూడా యెక్కువగానే వుంటాయని అన్నాడు. అందుకే తాను రాసిన 'మిట్టూరోడు' పుస్తకాన్ని యిప్పుడు యిష్టపడనని అన్నాడు. తాను అటువంటి పనికిమాలిన సెంటిమెంట్సు నుంచి బయటపడ్డానని చెప్పాడు.

ఈ సందర్భంలో తమిళ రచయిత జయకాంతన్ తన నవలకి వొక దానికి రాసిన ముందుమాట గుర్తొస్తోంది. (ఒక మనిషి, ఒక యిల్లు, ఒక ప్రపంచం) జయకాంతన్ ఏమంటాడంటే : యింత వరకూ మనిషి జీవితంలోని చీకటికోణాల్ని ఆవిష్కరించే రచయితగానే తనని అందరూ చూశారు. కాని యీ కొత్త నవలలో అంతా మంచినే చూస్తారు, అందరూ మంచివారే ఉంటారు అన్నాడు. అలాగే ఆ నవలలో అందరూ మంచివారూ, త్యాగహృదయులే వుంటారు. అదీ గ్రామంలో జరిగే కథే. కాని మా అమ్మాయి జ్యోతిర్మయికి ఆ నవల నచ్చలేదు. అందరూ మంచివాళ్ళే కావడం వల్ల కథలో బిగి, ఉత్సుకత లేకుండా పోయాయని అంది.

ఆ నవల ముందుమాటలోనే జయకాంతన్ వొక కథ చెప్పాడు. అది గ్రామాల్లో ప్రచారంలో వున్న కథ. ధృతరాష్ట్రుడు పాండవుల్నీ కౌరవుల్నీ దేశాటన కోసం పంపాడు. వారు తిరిగి వచ్చాక లోకం ఎలా వుంది అని ధృతరాష్ట్రుడు అడిగాడు. లోకం అంతా దుర్మార్గంగా వుందని దుర్యోధనుడు చెప్పాడు. లోకం అంతా ధర్మబద్ధంగా ఉందని ధర్మరాజు చెప్పాడు. ధృతరాష్ట్రుడు పుట్టు గ్రుడ్డి అవడం వల్ల వారిద్దరి అభిప్రాయాల్నీ స్వీకరించి, లోకం మధ్యస్థంగా వుందని అర్థం చేసుకొన్నాడు. యిదీ ఆ జానపద పురాణ కథ.

బహుశా లోకం మధ్యస్థంగా వుంది. అందుకే దాన్ని అర్థం చేసుకోవడం కష్టం. నామిని కూడా అంతర్ముఖుడై స్పష్టమైన తీర్పుని వాయిదా వేశాడు. అంటే మూలింటామెని కాని, పంది వసంతని కాని యెవర్నీ తప్పు పట్టడు నామిని. విశ్వనాథ

వేయిపడగల్లో లాగే గ్రామం వేదికగా సమాజంలోనూ, వ్యక్తుల్లోనూ వచ్చిన మార్పుని నిర్లిప్తంగా చిత్రిస్తాడు.

కాని వేయిపడగల్లో ధర్మారావు శిథిలమైపోతున్న వ్యవస్థతో పాటు శిథిలమైపోడు. కాని మూలింటామె సంగతి వేరు. ఆమె ఆత్మహత్య చేసుకుంటుంది.

అసలు బ్రాహ్మణులు మృత్యువుని ఆరాధిస్తారంటారు. కాని ఆలూరి బైరాగి చౌదరి అనే కవి మృత్యువు గురించి చచ్చినంత కవిత్వం రాసి మెప్పించాడు. మూలింటామె నవల ముగింపు కూడా మృత్యువాసన వేసి విషాదంలో ముంచెత్తుతుంది. యిది నిరాశావాదం అందామా?

బహుశా మూలింటామెని బతికించే మృత సంజీవని యేదో ముందు ముందు నామినికి దొరకవచ్చు. అసలు శూద్రులు కూడా బ్రాహ్మల్లాగే మృత్యువుని గురించి పలవరించడం ఆధునిక పరిణామం కావచ్చు. వారు వీరవుతూ వ్యవస్థ అంతా అల్లకల్లోల మవుతున్న తరుణాన్ని యిది సూచించవచ్చు. అదే సమయంలో శూద్రుల పట్ల ఆకర్షణ లాంటిదేదో విశ్వనాథ వారి ధర్మారావుని బతికించి వుండవచ్చు. విశ్వనాథకి శూద్రుల పట్ల అభిమానం యెక్కువ. అందుకే ధర్మారావు తండ్రి శూద్ర స్త్రీని కూడా వివాహం చేసుకున్నాడు. ప్రకృతికీ – సంస్కృతికీ మధ్య వారధిలాంటి పసిరిక అనే వింతజీవి శూద్ర స్త్రీకి బ్రాహ్మణుడికీ పుట్టినదే. యిది సాహిత్యంలో స్పష్టమైన వర్గీకరణని అసాధ్యం చేస్తుంది. ప్రగతిశీలురు – ఛాందసులు అనే వర్గీకరణని ప్రశ్నిస్తుంది యిటువంటి సాహిత్యం.

నామిని కూడా స్పష్టమైన వర్గీకరణకి లొంగడు. అతనిని ప్రగతిశీల శిబిరంలో చేర్చడం కష్టం. అదే సమయంలో తిరోగామి అని అనలేం.

కాని ప్రగతి రథ చక్రాల కింద, ఆధునిక యాంత్రిక నాగరికత ఉక్కుపాదాల కింద మూలింటామె నలిగి నాశనం కావడాన్ని నామిని భరించలేడు. నామినిదీ మూలింటామె భాషే. నామిని ఆ భాషని విస్మరించి, ముందుకు దూసుకుపోతే నామిని కాకుండా పోతాడు. అతడు మరొక రెవరో.

అసలు మనిషి అంటే భాషే. నీవు వ్యక్తీకరించే భాషే నువ్వు. అన్ని సమస్యలూ భాషా సమస్యలే. నీకు సరైన భాష లేదంటే నువ్వు నెల తక్కువ పిల్లాడివని అర్థం. భాషలోని వ్యాకరణమే నీకు రూపాన్ని యిస్తుంది.

అందుకే నామిని ఆ భాషలోంచి బైటికి రాలేదు. ఆ భాషలోంచి బైటికి రానిదే ప్రగతి పట్టాలపై అడుగుపెట్టలేదు. ఆ భాషని వదిలేశాడా అతడు మరొక కంచె ఐలయ్యగా మారిపోతాడు. అందుకే నామిని మృత్యువిషాదం ఆధునికతకి ప్రతిఘటన. అతని బీభత్స రసమంతా అతని భాషలోనే యిమిడిపోతుంది, కమండలంలో సముద్రం యిమిడిపోయినట్లు. అంటే బీభత్సమంతా ఆధునిక మార్పుకి ప్రతిఘటనే. యిక్కడే నామిని వొక శూద్ర విశ్వనాధగా సాక్షాత్కరిస్తాడు. యముడు నచికేతుడికి బ్రహ్మజ్ఞానాన్ని బోధించినట్లు, మూలింటామెలోని మృత్యువు జీవిత రహస్యాన్ని బోధిస్తుంది. ఆధునికత తళుకుల వల్ల ప్రకృతి విధ్వంసం, జీవన విధ్వంసం జరిగిపోతాయని హెచ్చరిస్తుంది. యిది నామిని మృత్యుబోధ, బీభత్స రహస్యం.

నామినిని నేనొక ప్రశ్నవేశాను. మీరు వొకప్పుడు బీభత్సరసాన్ని వ్యతిరేకించారు కదా యిప్పుడు యీ నవలలో అదే రసాన్ని యెందుకు ఆశ్రయించారు అని కొందరు ప్రశ్నిస్తున్నారు అని చెప్పాను. దానికి ఆయన సమాధానం నేను సినిమాటిక్ బీభత్సానికి మాత్రమే వ్యతిరేకిని అని.

నామిని చేసిందదే అని ఆరోపించేవాడు కుహనా విమర్శకుడు మాత్రమే. మూలింటామె మనవరాలి మరణం అటువంటిదే అంటాడు. అది సినిమాటిక్ అంటాడు. కాని పిల్లుల మరణం, మూలింటామె మరణం, ఆమె మనవరాలి మరణం గురించి ప్రజల గుసగుసలు యిదంతా వొక క్రమం. బీభత్స క్రమం. యీ నిగూఢ కార్యకారణ సంబంధాన్ని తెలుసుకోవాలంటే, వొక సహజమైన భాష కోసం, వ్యాకరణం కోసం, వ్యక్తీకరణం కోసం వెతకాలి. ఎక్కడైనా పిల్లులు కనబడితే వాటితో సంభాషించి తెలుసుకోవాలి.

యింతకీ నామిని అంటే భాషే అని యెందుకన్నానంటే – నామిని భాషలో బూతులు దొర్లుతాయని పెద్ద మనుషులు ఆరోపించడం నాకు గుర్తుంది. లంజ లాంటి పదాలు వాడకూడదని కొందరు హితబోధ చేశారు. నామిని వాళ్ళ వ్యాకరణ సూత్రాల్ని యెప్పుడూ పట్టించుకోలేదు. గ్రామీణ వ్యాకరణం అతనిది. పల్లెటూళ్ళలో అలవోకగా వాడే పదాలు పట్టణస్థులకి అసభ్యంగా కనబడడం చూస్తుంటాం. కాని వారి సూత్రాలని నామిని పాటించాలా?

యిటీవల కర్నూలులో జరిగిన కథల వర్క్‌షాపులో వొక చర్చ జరిగింది. కథలలో బూతులు వాడవచ్చా అనేదే అ చర్చ. తమిళ కథల్లో చాలా బూతు పదాలు

యిష్టారాజ్యంగా వాడతారు. వాటిని తెలుగులోకి అనువదించాలంటే సమస్య ఎదురౌతోందని వొకరు వాదించారు.

ఐతే చాలా కాలం క్రితం ఋగ్వేదమే పెద్ద బూతు అని వొక పెద్దమనిషి పుస్తకం రాశాడు. యింతకీ తమిళులకి లేని బూతు భయం మన తెలుగు వాళ్ళకీ తెలుగు పత్రికలకీ ఎందుకు వచ్చింది! నామిని వీళ్ళందర్నీ మీరూ మీ భాషా పెద్ద పత్తిత్తులా అని నిలదీస్తాడేమో!

తెలుగు సినిమాల నిండా బూతులు, ద్వంద్వార్థం డైలాగులూ వుంటాయి. సాహిత్యం మాత్రం మడికట్టుకోవాలి అంటారు. పత్రికలు కూడా నిబంధనలు పెడ్తాయి. యిది తెలుగువారి హిపోక్రసీని తెలియజేస్తుంది.

యీ హిపోక్రసీని బద్దలు చేయడానికి కూడా నామిని భాషను ఆయుధంగా వాడుతున్నాడనిపిస్తుంది. రసాత్మకంగా వ్రాయవలసిన వాక్యాన్ని ప్రగతిశీల సిద్ధాంతాల కోసం బలిపెట్టడం కన్న పెద్ద బూతు లేదని నామిని అభిప్రాయం కావచ్చు.

నామిని భాష గురించి పేర్లు పెట్టే దమ్మెవరికుంది? 'బాణోచ్ఛిష్టం జగత్సర్వం'. సంస్కృత సాహిత్య ప్రపంచమంతా బాణుని ఉచ్ఛిష్టమే అన్నారు. ఎందువల్ల? అతడు స్వభావోక్తినే అలంకారంగా తీసుకొని గొప్ప వర్ణనలు చేశాడు. స్వభావోక్తి అంటే వున్నది ఉన్నట్లు రాయడం, చూసింది చూసినట్లు రాయడం.

కుంతకుడు అనే ఆలంకారికుడు స్వభావోక్తి అలంకారమైతే అలంకరించబడేది (అలంకార్యం) ఏది అని ప్రశ్నించాడు. స్వభావోక్తి అంటే ఉన్న వస్తువే. అదంతట అదే ఎలా అలంకారమౌతుంది అని ప్రశ్నించాడు.

అంటే సహజంగా ఆవు అంబా అన్నట్లు మాట్లాడ్డం కావ్యమెలా అవుతుంది అని అడిగారు. సహజమైన మాటలూ వర్ణనలూ కావ్యత్వాన్ని ఎలా పొందుతాయి? ఎలా పొందుతాయో నిరూపించాడు నామిని. అతని అడుగుజాడల్లోనే తర్వాతి కథకులు నడిచారు. వివిధ ప్రాంతాల నుంచి మాండలికాల నుంచి కథకులు పుట్టుకొచ్చారు. నామిని ఉచ్ఛిష్టం జగత్ సర్వం అనే నానుడి వచ్చింది.

రుద్ర సూక్తం వంటి వేదమంత్రాలు కూడా స్వభావోక్తికి స్థానం కల్పించాయి. ముఖ్యంగా రుద్ర సూక్తంలోనూ దండకాల్లోనూ కనిపించే సుదీర్ఘ వాక్యరచన, ఊపిరి తీసుకోనివ్వని వాక్యరచనకి మూలింటామెలో స్థానం కల్పించాడు నామిని. కాదంబరిలోని బాణుని వర్ణనలు కూడా సుదీర్ఘమైన వాక్యాలతో నిండి వుంటాయి.

ఆ వాక్యాలు ఊపిరి తీయనియ్యవు. బాణం గుచ్చుకుంటే ఉచ్వాసం బయటికి రానట్లే, బాణకవి రాసిన కాదంబరిని చదువుతుంటే ఉచ్వాసం బయటికి రాదని వొక కవి వర్ణించాడు. అంటే అంతటి సుదీర్ఘ వాక్యాలన్నమాట.

వేదంలోని రుద్రసూక్తం కూడా ఊపిరి తీయనివ్వని ఏక వాక్యతని కలిగి వుంటుంది 'నమో భవాయచ, రుద్రాయచ, నమశ్శర్వాయచ, పశుపతయేచ, నమో నీలగ్రీవాయచ, శితికంఠాయచ.... యీ చ...చ...చ... లకి అంతం ఎక్కడ? అది అనంతంగా సాగిపోతుంది. యిదీ మంత్ర సరస్వతి. పైగా యీ రుద్రసూక్తం స్వభావోక్తి అలంకారంలోనే వుంటుంది. భగవంతుణ్ణి చుట్టూ కనిపించే అన్నిటితోనూ పోలుస్తుంది. సకల వృత్తుల వారిగానూ చివరికి దొంగగా కూడా ప్రార్థిస్తుంది. సహస్ర వృత్తుల సమస్త చిహ్నాలూ, అంకెలూ, మానవ ప్రవృత్తులూ, అన్నీ దైవ స్వరూపాలే. అంటే దైవం వొక స్మృతి పరంపర మాత్రమే. అందుకే యీ మంత్రాలు.

మొత్తం ఏక వాక్యంగా మధ్యలో విరామం లేకుండా సాగుతాయి. వివిధ దైవస్వరూపాల గురించి దండకాలు కూడా యిదే యేక బిగిలో సాగుతాయి.

'శ్రీ పార్వతీపుత్ర, లోకత్రయాస్తోత్ర, సత్పుణ్యచారిత్ర...' అంటూ అంతులేకుండా సాగుతుంది దండకం. ముగిశాకే మనం ఊపిరితీయాలి. వివిధ దేవతల సహస్రనామావళిలో కూడా యీ యేకవాక్యత కనబడ్తుంది.

నా ఉద్దేశ్యంలో ఏకవాక్యత అంటే ఏమిటో మరింత స్పష్టంగా వివరిస్తాను. కొన్ని పదాలు కలిస్తే వాక్యం అవుతుంది అంటారు. కాని చాలా పదాలు వొకేచోట చేరినా వొకే వాక్యమవుతుంది. నామిని చేసిందేమిటంటే అనేక వాక్యాలని కలిపి వొకే వాక్యంగా మార్చెయ్యడం. వొక స్మృతి నుంచి మరొక స్మృతి ఆవిర్భవిస్తూ జన్మపరంపరని తలపిస్తున్నపుడు, దాన్ని వ్యక్తం చెయ్యడం కోసం నామిని వాక్యగుచ్ఛాన్ని రచించాడు. యీ వాక్యగుచ్ఛాలు సురభిళ శోభితాలు.

ముఖ్యంగా మనవరాలి గురించి మూలింటామె స్వగతం. పంది వసంత అమ్మకానికి పెట్టడంతో పెరట్లోని చెట్లను కొట్టెయ్యడం.

మూలింటామె స్వగతమంతా తన మనవరాలి గురించి స్మృతులే. ఆ స్మృతుల్లో ప్రకృతి కూడా భాగమే. యిక్కడ నామిని ప్రకృతికీ మనిషికీ మధ్య దూరాన్ని చెరిపేస్తాడు.

చెట్లు కొట్టే సన్నివేశంలో మనిషికీ ప్రకృతికీ మధ్య బంధం చెదిరిపోవడం, సెంటిమెంట్లూ నమ్మకాలూ కూడా చెల్లాచెదురై పోవడం చూపిస్తాడు. చెట్లతో, ప్రకృతితో

మనిషికి గల ప్రాచీన అనుబంధపు స్మృతినీ, ప్రకృతిని ఆరాధించే ప్రాచీన విశ్వాసాన్ని గుర్తు చేస్తూ అది చెదిరిపోతున్న సందర్భాన్ని గాఢ విషాదంగా మలుస్తాడు. యిక్కడ యితని వాక్యశైలీ, కథా వస్తువూ గాఢంగా, జంటనాగుల్లా పెనవేసుకుపోతాయి. ఊపిరి తీసుకోనివ్వని స్మృతి పరంపర, వూపిరి తీసుకోనివ్వని వాక్యశైలి.

ప్రాచీన స్మృతులు యెప్పుడు నశిస్తాయో అప్పుడు మనిషి కూడా పూర్తిగా నశిస్తాడు. యీ ఎండలూ, యీయెల్‌నినోలూ అంతా ప్రకృతి విధ్వంస ఫలితమే అన్నాడు నామిని యిటీవల ఫోనులో. యిది తప్పనిసరి పరిణామమేమో అన్నాను. ఎందుకు తప్పదు. మనకా దృష్టి లోపించిందంతే అన్నాడు నామిని.

దృష్టే సృష్టి. అదే ప్రాచీన వేదాంత రహస్యం. దృష్టి అంటే భాషే. వార్తాపత్రికల్లో పనిచేసినా తన సహజ ప్రాచీన భాషని, అనంతమైన స్మృతుల్ని నీటి ఊటలా పైకి జిమ్మగల భాషని భద్రంగా పదిలపరుచుకున్నాడు నామిని. నామిని భాషని అర్థం చేసుకోవడానికి, వొక నూతన వ్యాకరణ సూత్రాలు అవసరం. అది గ్రామీణ శూద్ర వ్యాకరణం. అది నిజానికి వైదికమే.

యీ ప్రపంచంలో స్మృతులు మాత్రమే సత్యమైనవి. యెందుకంటె యిది మర్త్య లోకం. మరణశీలమైన లోకం. బ్రహ్మ కూడా ప్రళయానంతరం ప్రపంచాన్ని స్మరిస్తాడు. అదే సృష్టి అని పురాణాలు చెప్తున్నాయి. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు అంటే స్మృతులే, జ్ఞాపకాలే. మూలింటామె తన మనవరాలి గురించి నిరంతరం స్మరిస్తూనే వుంటుంది. ఆ స్మృతులని పోగుచేస్తే ఆమె మనవరాలి రూపం స్పష్టాస్పష్టంగా గోచరిస్తుంది. మనవరాలు యెక్కడా ప్రత్యక్షంగా గోచరించదు.

యెందుకు ఆమె మనవరాలు లేచి పోయింది! మాట్లు వేసుకునేవాడి పేదరికాన్ని చూసి జాలిపడా, ఆకర్షణా? ఏదీ మనకు స్పష్టంగా తెలిసే అవకాశం లేదు.

అసలు ఆకర్షణ అంటే ఏమిటి? ఏది మనిషిని ఆకర్షిస్తుంది? దీనికి స్పష్టమైన సమాధానం లభించదు. ఏనాటికీ లభించదు.

త్రిపురా రహస్యం అనే వేదాంత గ్రంథంలో మహా సుందరియైన యువరాణి కురూపియైన సేవకుడితో సంబంధం పెట్టుకుంటుంది. అది చూసి రాకుమారుడు దిగ్భ్రాంతి చెందుతాడు. ఆ రాకుమారుడు వైరాగ్య సంపన్నుడుగా మారిపోతాడు. ఎందుకంటె మనం చూసే చూపులోనే అందం, అంద వికారం ఉన్నాయి. నిజంగా మనిషిలో లేవు. ఎందుకంటె మనిషి ఎప్పటికీ బయటే వుంటాడు. అతని

గురించి ఆలోచనలే మనకు అందేవి. ఆ ఆలోచనలే, ఆ వ్యక్తి గురించి స్మృతులే ఆకర్షణని సృష్టిస్తున్నాయి. అందువల్ల ఆకర్షణని వస్తుగతంగా పరిశీలించడం అసాధ్యం.

యిక్కడ నామిని మునిలా మారి, మూలింటామె మనవరాలు ఎందుకు లేచిపోయిందో చెప్పకుండా వదిలేస్తాడు. నామిని మౌనంలో గొప్ప వేదాంత రహస్యమే దాగి వుంది. దానిని గ్రహించలేని వాళ్ళు భర్త చేతగానితనం వల్లే లేచిపోయిందని తేల్చేస్తారు అతి సులువుగా.

చేతగాని తనం అంటే ఏమిటి? సూటిగా అడుగుతాను. అంగస్తంభనం సరిగా కాదనా? భావానికి బయట భావప్రాప్తి ఉందా అని నేను ప్రశ్నిస్తున్నాను. భావదారిద్ర్యం అంగస్తంభన సమస్యకి దారి తీస్తుందని కూడా హెచ్చరిస్తున్నాను.

యిటువంటి అధమస్థాయి భాష వాస్తవికతా వాదానికి చెందినది. యీ వాస్తవికతా వాదం ఆధునికత సృష్టి. మానవుడికి స్పష్టమైన హేతుబద్ధత వుందని, యీ హేతుబద్ధతతో ప్రకృతిలోని ప్రతిదాన్నీ అర్థం చేసుకొనగలడనే జ్ఞాన దురహంకారం యిది. మానవ ప్రకృతినీ, ప్రకృతినీ కూడా మానవుడు హేతుబద్ధతతో అర్థం చేసుకొని శాసించగలడనే దురభిప్రాయం యిది.

యిది ప్రకృతిపై మానవుణ్ణి సార్వభౌముడిగా నిలిపిన ఆధునిక దురహంకారం. యీ దురహంకారం దేని నుంచి జనించిందంటే, ప్రకృతి – మనిషీ, జీవమూ – జడమూ పూర్తిగా వేరు వేరనే భేద దృష్టి నుంచే యీ అహంకారం జనించింది. యీ భేదభావం నుంచే వాస్తవికతా వాదం జనించింది.

యీ వాస్తవికతా వాదాన్ని నామిని మూలింటామెలో ఛేదించివేస్తాడు. యీ నవలలో అన్నిటికన్న ముఖ్యమైన పాత్రలు పిల్లలు. యివి కథలో అతి సహజంగా యిమిడిపోతాయి. అలాగే చెట్ల ఆకులు కూడా గలగలా మాట్లాడుకోవడం, పరస్పరం సంభాషించుకోవడం నామినికి తెలుసు.

దురహంకారంతో శాసించడం కాక, ప్రేమతో సహానుభూతితో స్పందించే స్వభావం కలవాడు కావడం వల్లే మూగ ప్రకృతిలోని కదలికల్నీ, భాషనీ గమనించ గలిగాడు. అలాగే మానవ ప్రకృతిని మంచిచెడుల తుదితీర్పులతో చీకటి–వెలుగుల దృష్టిలోంచి కాక నిర్లిప్తంగా వీక్షించి మనకళ్ళముందుంచాడు. కాముకత్వాన్ని చీకటి అనే హ్రస్వదృష్టి నామినిది కాదు. ఎందువల్ల నంటే భారతీయ శాస్త్రవేత్త జగదీశ్

చంద్రబోస్ లాగే సకలప్రాణుల్లోనూ జీవ చలనాన్ని చూడగల సమ దృష్టి నామినిది. (ప్రకృతికీ మానవ ప్రకృతికీ గల సంబంధాన్ని తర్వాత వివరిస్తాను).

జగదీశ్ చంద్రబోస్ చెట్లకి కూడా మానవులకి వుండే స్పందనల వంటి స్పందనలే వుంటాయన్న సత్యాన్ని కనుగొన్నాడని అందరికీ తెలుసు. అంతేకాదు లోహాలకీ సకల పదార్థాలకీ కూడా అలాంటి స్పందనలే వుంటాయని కనుగొన్నాడు బోస్. ఆ విధంగా జీవ జడపదార్థాలకి వుండే దూరం చెరిపేశాడు. దాంతో పాశ్చాత్య శాస్త్ర వేత్తలు గగ్గోలు పెట్టారు. జీవ శాస్త్రానికీ భౌతిక శాస్త్రానికీ గల దూరాన్ని చెరిపేస్తున్నాడని విమర్శించారు. విశ్వమంతా వొకే సజీవమూర్తి అన్న భారతీయ దృష్టి ఆయనది.

విశ్వం అంతా వొకే దేహంగా గల చైతన్యానికి జీవి సూక్ష్మరూపం మాత్రమేనని శంకరాచార్యులు పంచీకరణ గ్రంథంలో స్పష్టం చేశారు.

యిదే దృష్టి మూలింటామెలో మనకి ప్రత్యక్షమౌతుంది. మనవరాలు లేచిపోయినప్పుడు, దిక్కులేక అల్లాడ్తున్న పిల్లలతో పాటు పిల్లులని కూడా తలచుకోవడం దీనికి పరాకాష్ట.

అలాగే మూలింటామె మనవరాలు లేచిపోవడానికి గల కారణాన్ని ఛేదించడానికి నామిని ప్రయత్నించడు. ఆమె గురించి వివిధ వ్యక్తుల అభిప్రాయాలు వారి వారి స్వభావాన్ని బట్టి వ్యక్తమౌతుంటాయి. ఆమెని వెనక్కి తీసుకురావాలని ప్రయత్నించినపుడు ఆమె తిట్టి పంపిందని మాత్సర్యగ్రస్తులు చెప్తే సాదుస్వభావురాలు చీమంతమ్మ చెప్పింది వేరు. తన గత జీవితాన్ని, భర్తని, పిల్లల్ని తలచుకొని తీవ్ర వేదన చెందిందని చెప్తుంది చీమంతమ్మ. యీ భేదానికి కారణం వారి వారి స్వభావమే. అసలు వాస్తవం ఏమిటి? మానవ ప్రవర్తనలోని అన్‌ప్రెడిక్టబిలిటీని, ఆలోచనకీ హేతువుకీ అందని తత్వాన్నీ సహృదయతతో ఆవిష్కరిస్తాడు నామిని.

ప్రకృతిని కాని మానవ ప్రకృతిని కాని శాసించాలని చూడలేదు నామిని. యిదే మూలింటామె నవలని ఉత్తమ నవలగా నిలిపింది.

ఐతే ప్రకృతిపై విజయమే నాగరికతగా పిలువబడ్తోంది. అలాగే మనిషి తన ప్రకృతిపై అంటే చైతన్యంపై అజమాయిషీ కోసం ప్రయత్నించడమూ దీనిలో భాగమే. అందుకే ఫ్రాయిడ్ అణచివేయబడిన కోరికలపై సూపర్ ఇగోని కాపలాపెట్టాడు. చీకటిపై వెలుతురుని కాపలా పెట్టాడు. యిటువంటి విభజనలన్నీ ఆధునికత తీసుకు

వచ్చిన రుగ్మతలే, ప్రతిదాన్నీ ముక్కలు ముక్కలుగా చూసే ఆధునిక విశ్లేషణాత్మక దృష్టి నుంచి వచ్చినవే. యిదే కాముకత్వాన్ని చీకటిగాను, దాని నుంచి వెలుగులోకి పయనం అత్యావశ్యకంగానూ భావించే దృష్టికి మూలం.

నామినిలో యీ భేదదృష్టి లేకపోవడం వల్లే అన్నిటినీ వర్ణించినట్లే కామాన్ని కూడా యథేచ్ఛగా వర్ణిస్తాడు. కాళిదాసులాగే. దానిపై యెటువంటి సూపర్ ఇగోని కాపలా పెట్టడు.

ప్రకృతికీ – సంస్కృతికీ సామరస్యం వుంది. ప్రకృతికీ – ఆధునిక నాగరికతకీ అటువంటి సామరస్యం లోపించింది. నేచర్ – కల్చర్ విరుద్ధమైనవి కావు. Nature -Nurture ఇవి మాత్రమే విరుద్ధమైనవి అంటాడు మిత్రుడు నరహరి.

కొన్ని జంతువుల్ని చంపడం అరిష్టం అనే భావన, రావి చెట్టులాంటి కొన్ని చెట్లని పెంచడం, చెట్లకి పెళ్ళిళ్ళు చెయ్యడం పుణ్యమని భావించడం యివన్నీ చూస్తుంటే ప్రకృతితో మనిషికి గల అనుబంధాన్ని సంస్కృతి కాపాడ్తూ వచ్చిందనే సత్యం బోధపడ్తుంది.

ఇంద్రప్రస్థం అనే నగరాన్ని నిర్మించడం కోసం ఖాండవ వనాన్ని పాండవులు దహించిన కథ భారతంలో వుంది. అదే కథలో జరిత అనే పక్షి యొక్క సంతానాన్ని అగ్ని కరుణతో దహించకుండా వదిలివేసిన కథ వుంది. అంటే ప్రకృతిని సమూలంగా నాశనం చేయకుండా కొంత సామరస్య దృష్టితో వ్యవహరించాలని, విజ్ఞత పాటించాలని సంస్కృతి హెచ్చరిస్తుంది.

కాని ఆధునిక నాగరికత, సంస్కృతిని మూఢ విశ్వాసంగా కొట్టేస్తుంది. ప్రకృతినీ, పశుపక్ష్యాదుల్నీ జడంగా భావించి, మానవుడొక్కడే చైతన్యవంతుడనీ ప్రకృతిని నిరంతరం మారుస్తూ రావడమే అతని కర్తవ్యమని ఆధునిక నాగరికత బోధిస్తుంది. ఆ విధంగా మనిషిని మలచవలసిన అవసరం ప్రభుత్వాలకీ ఆర్థిక వ్యవస్థకీ వుందని ఆధునికత బోధిస్తుంది.

యీ దృష్టిపై నామిని తీవ్రంగా దాడి చేస్తాడు. పిల్లులని పట్టి చంపి జీవించే వ్యక్తితో మూలింటామె చెప్తుంది. మనిషిని చంపడం పాపం కాదు, పిల్లుల్ని చంపడం పాపం. (కథలో భాగంగా చెప్తుందనుకోండి).

యింత సాహసవంతమైన వాక్యాల్ని రచించిన కవులెవరూ మనకి కనబడరు నామిని తప్ప. యిక్కడ మనకి శిబిచక్రవర్తి గుర్తుకు వస్తాడు.

యింక మూలింటామె చనిపోతూ చెప్పిన మాటలు యీ దృక్పథాన్ని యింకా స్పష్టం చేస్తాయి. "నా మనవరాలు మొగుణ్ణొదిలేసింది అంతే గాని మియాం మియాం అంటూ నీకాళ్ళకాడా నా కాళ్ళకాడా చుట్టకలాడే పిల్లుల్ని చంపలేదే"

యిలాంటి వాక్యాల్నీ, యిలాంటి కథల్నీ సంభాషణల్నీ కల్పించాలంటే కవి కల్పనలకి హద్దులు ఉండకూడు. 'నిరంకుశాః కవయః' కవులు నిరంకుశులు. 'నియతికృత నియమ రహితాం హ్లాదైకమయీం అనన్య పరతంత్రాం', కావ్య జగత్తు ఎటువంటిదంటే విధి నియమాల్ని ధిక్కరించేది, ఆనందమయమైనది, పరతంత్రత ఏ మాత్రం లేనిది.

యిటువంటి కవి వాక్కుకి సంయమనం, కుదురు కావాలని బోధిస్తారు అధములు.

ప్రాచీన కాలంలో కవి వాక్కుని బట్టి వ్యాకరణం సరిదిద్దబడింది. 'ఆర్య వ్యవహారంబుల దృష్టంబు గ్రాహ్యంబు', అని చిన్నయసూరి సూత్రమే రచించవలసి వచ్చింది. ఆర్యులు అంటే కవులే. పెద్దన వంటి మహాకవులు 'అమవస నిశి' లాంటి కొత్త శబ్దాలు ప్రయోగిస్తే అవే శిరోధార్యమయ్యాయి. వాక్కు మహిమ నీకేం తెలుసురా వాచాలుడా.

రుషీనాం పునరాద్యానాం

వాచమర్థోను ధావతి (భవభూతి)

రుషుల వాక్కుల వెంట అర్థం దౌడు తీస్తుంది అంటాడు భవభూతి. రుషులంటే కవులే. 'నానృషిః కురుతే కావ్యం', రుషి కానివాడు కవి కాలేడు. అసలు కవి అంటే బ్రహ్మే.

అపారే కావ్య సంసారే

కవిరేవ ప్రజాపతిః

అపారమైన కావ్య జగత్తులో కవే బ్రహ్మ.

కవి బ్రహ్మ ఎలా అయ్యాడు? కవి వాస్తవ సంఘటనల్నీ అనుభవాల్నీ కుప్పబోయడు. వినూత్న కల్పనల్ని చేస్తాడు. ఇది మూలింటామెలో కనబడ్తుంది. అందుకే కుతకుతా ఉడుకుతున్న కోడికూర కూడా తన వాసన ద్వారా వొక వార్తని మోసుకెళ్తున్నట్లు అద్భుత కల్పన చేస్తాడు నామిని.

కోడికూర చెప్తున్న కథని వినడం చేతకాక, దాన్ని నిర్జీవంగా భావించి, సాగదీయడంగా పరిహసిస్తాడు రసజ్ఞతలేని విమర్శకుడొకడు.

అరసికస్య కవిత్వ నివేదనం

శిరసి మాలిఖ మాలిఖ మాలిఖ.

'రసం తెలియని వాడికీ, వాక్యం రసాత్మకం కావ్యం అన్న సత్యం తెలియని వాడికీ' కవిత్వం వినిపించే దురదృష్టాన్నీ తలరాతనీ కల్పించవద్దు అని వొక రసజ్ఞుడు బ్రహ్మదేవుణ్ణే స్వయంగా ప్రార్థించాడు.

ప్రాచీనకాలంలో ప్రకృతి గురించి గొప్ప వర్ణనలే చేశారు కవులు. కాని ఆ కాలం వేరు. ప్రకృతిపైన ఆరాధనా భావం వున్న కాలం అది. ప్రకృతిలో యీశ్వరుణ్ణి వీక్షించే కాలం అది. ఈశావాస్య మిదం సర్వం.

ప్రకృతిని ధ్వంసం చెయ్యడమే నాగరికతగా భావించబడ్తున్న యాంత్రిక యుగం మనం జీవిస్తున్న కాలం. చరాచరాల్లో జీవం ప్రవహించే ప్రకృతినీ, దాని విధ్వంసం వల్ల వచ్చిన మానవ వికృతినీ ధ్వని పూర్వకంగా వర్ణిస్తాడు నామిని. సుదీర్ఘ వర్ణనలు కాని, చర్చలు కాని లేకుండా, ఎటువంటి వాచ్యత లేకుండా ధ్వని పూర్వకంగా ప్రకృతినీ, పశుపక్ష్యాదులనీ, మనుషుల సహజ అనుబంధాలనీ ఉమ్మడిగా కాపాడుకోవలసిన ఆవశ్యకతని ధ్వని పూర్వకంగా అభివర్ణిస్తాడు నామిని. అసలు ధ్వని అంటే ఏమిటి?

యత్రార్థః శబ్దోవా తమర్థ ముపసర్జనీ కృతస్వార్థౌ

వ్యంక్తుః కావ్య విశేషః సధ్వనిరితి సూరిభిః కథితః (ధ్వన్యాలోకం)

'శబ్దార్థాలు తమస్వార్థాన్ని' అంటే తమ ప్రయోజనాన్ని బలిపెట్టి, వాచ్యం కాని దాన్ని స్ఫురింపజేయడమే ధ్వని.

'వాచ్యం కాని దాన్ని స్ఫురింపజేయడం' అదీ ధ్వని.

ఉపన్యాసాలు యివ్వడం కాదు. బోధించడం కాదు. సున్నితంగా స్ఫురింపజెయ్యడం అదే ధ్వని. అదే నామిని.

అసలు స్ఫురింపజెయ్యడం ఎందుకు, ధ్వని పూర్వకంగా చెప్పడం యెందుకు? వాచ్యంగా చెప్పెయ్యచ్చుకదా? చాలా కాలం ప్రగతిశీల మేధావులు యిటువంటి వాతావరణాన్నే వ్యాపింపజేశారు. ఫక్తు వాచ్యత. దీని వల్ల జరిగిన నష్టమేమిటంటే

– వొకే విషయానికుండే బహుముఖ కోణాల్ని వ్యక్తం చెయ్యడం సాధ్యం కాకుండా పోయింది. ప్రచారమే సాహిత్యంగా చలామణీ కావడం వల్ల జరిగిన నష్టమిది.

నిజానికి, కనబడేది ఎప్పుడూ సత్యం కాదు. సూర్యుణ్ణి ఒక గోళంగా చూస్తాడు సైంటిస్టు. లో వెలుగుకి సింబల్‌గా చూస్తాడు వేదాంతి. పద్మప్రియుడిగా చూస్తాడు కవి. మేల్కొల్పేవాడిగా చూస్తాడు సామాన్యుడు. యిక్కడ వొకే విషయాన్ని విభిన్న వ్యక్తులు విభిన్నంగా చూశారు. వారివారి సంస్కారాన్ని బట్టి చూశారు.

యిలా విభిన్న దృష్టులకీ, వేల దర్శనాలకీ ఆస్కారం ఉందని గ్రహించి, వాచ్యాన్ని అప్రధానం చేసి ధ్వనికి ఆస్కారమిచ్చే భాష ద్వారా రసస్ఫూర్తిని కలిగింపజేసేవాడే గొప్ప కవి, కథకుడు. నామినిలో యిది కనబడ్తుంది.

మూలింటామె మనవరాలు ఎందుకు లేచిపోయింది?

పంది వసంత మంచిదా, చెడ్డదా?

ఆమె ఎంచుకున్న జీవితం గ్రామాన్ని సరైన మార్గంలో నడిపిస్తోందా? చెడ గొడ్తోందా?

మూలింటామె మౌనం మంచిదా? చెడ్డదా?

యిటువంటి ప్రశ్నలకి వాచ్యంగా సమాధానాలు దొరకవు. వ్యంగ్యమూ, హాస్యమూ, సునిశితమైన తర్కమూ కలగలిసిన భాషతో మన బుద్ధికి పదునునీ హృదయానికి స్పందననీ ఏకకాలంలో అందజేస్తుంది మూలింటామె.

అంటే యీ నవల సందిగ్ధ స్థితిలో మనని వదిలేస్తుందా?

వొక వ్యాసం, సిద్ధాంత గ్రంథం చెయ్యలేని పనిని సాహిత్యం చేస్తుంది. దానిలో తర్క ప్రాధాన్యత కంటె అనుభూతి ప్రాధాన్యత ఎక్కువ. హేతువుని బలిపెడ్తుందని కాదు. దాని హేతువు వేరు. ఎందుకంటె సాహిత్య ప్రపంచం కాల్పనిక జగత్తుకి చెందినది. కల్పనకి అవధులు లేవు. హేతువుని కల్పన శాసిస్తుంది. కల్పన హేతువుని అధిగమిస్తుంది.

ఎందుకో యిక్కడ నాకు ఐన్‌స్టీన్ సిద్ధాంతానికి సంబంధించిన కవల పిల్లల కథ గుర్తొస్తోంది. కవల పిల్లల్లో వొకడు కాంతి వేగంతో ప్రయాణించి తిరిగివచ్చాడు. మరొకడు భూమ్మీద సాధారణ జీవితం గడిపాడు. కాంతివేగాన్ని అందుకున్న వ్యక్తి యువకుడిగా మిగిలిపోయాడు. రెండోవాడు వృద్ధుడైపోయాడు.

యిది సాపేక్ష సిద్ధాంతాన్ని వివరించే కథ. సైన్సూ, ఆర్ట్సూ భౌతిక జగత్తులోని హార్డ్ రియాలిటీస్ నుంచి రోజువారి జీవితం నుంచి పలాయనం చిత్తగించడానికి ఉపయోగిస్తాయని ఐన్‌స్టీన్ అన్నాడు. నిజానికి అవి భౌతిక జగత్తు పరిధుల్ని పరిమితుల్ని అధిగమిస్తాయి. ముఖ్యంగా సాహిత్యం (Who Got Einstein's Office - by Edward Regis).

సాహిత్యం, ప్రయోగం మీద ఆధారపడదు. నేటి సైన్సు కూడా ప్రయోగం యొక్క పరిమితుల్ని గుర్తిస్తోంది. సాహిత్యం ప్రయోగం మీద కాని, అనుభవం మీద కాని ఆధారపడకూడదు. అది కల్పనా జగత్తు. కవి కల్పనా సామర్థ్యమే దానిలో ప్రతిబింబించాలి. వాస్తవం వొక సాకు మాత్రమే. యీ సత్యాన్ని తెలుసుకున్న వాడు కావడం వల్లే నామిని పిల్లుల్నీ, చెట్లనీ, కోడికూరనీ కూడా కథని నడిపే చైతన్యశీలమైన పాత్రలుగా చేయగలిగాడు. సంభాషణల్లో, వ్యాఖ్యానాల్లో, సర్వేసర్వత్ర తానే విజృంభించి విశ్వరూపాన్ని చూపగలిగాడు. నిజానికి కవి అతీతంగా వుండి రాసే రచన అధమమైనది. కవి కావ్యంలో సంపూర్ణంగా లీనమై సర్వం తానుగా మారి అహం బ్రహ్మాస్మి అంటూ విజృంభించినపుడే అది గొప్ప రచన కాగల్గుతుంది.

వాస్తవికత వుట్టిపడే రచనల్లో రచయితలు అనుమానాస్పదంగా నంగినంగిగా నడుచుకుంటారు. ఇటువంటి రచనల్నే నామిని ఎక్కాల పుస్తకాలతో పోల్చాడు. ముఖ్యంగా – కాళీపట్నం రామారావు, రావిశాస్త్రి గారి కథలు. యిదే మార్గంలో చాలా మంది నడిచారు.

వాస్తవికతావాద సాహిత్యంలో వుండే ప్రధానలోపం వాస్తవికత అనేది వొకటి వుందని, దాన్ని స్పష్టంగా చిత్రించవచ్చనే భ్రమ. నీదైన దర్శనం తప్ప వాస్తవికత అంటూ ఏదీ లేదు.

యీ సత్యాన్ని తెలుసుకున్నపుడు కల్పనకి కళ్ళాలు బిగించడం మానేస్తాడు కవి. దాని వల్ల ఎవరూ దర్శించని విషయాల్ని కూడా దర్శింపజేయగలుగుతాడు.

యథాస్మై రోచతే విశ్వం
తథైదం పరికల్పతే

కవే బ్రహ్మ. అతడు యేవిధంగా యీ ప్రపంచాన్ని చూడాలనుకొంటున్నాడో అది అలా మారిపోతుంది. అది కవి శక్తి.

యితరులకి లేని శక్తి కవికి వుంది. అదే ప్రతిభ. ప్రతిభ అంటే ఏమిటి? 'నవ నవోన్మేష శాలినీ ప్రతిభా', నిరంతరం నిత్య నూతనంగా వికసించేది, వినూత్న కల్పనలకు ఆస్కారమిచ్చేది, అదే ప్రతిభ. అటువంటి ప్రతిభని వాస్తవికతకు బలిపెట్టకూడదు.

నామిని అటువంటి సాహసికుడైన కవే. అందుకే అంత విస్తృతమైన కాల్పనిక జగత్తుని కల్పించాడు. యీ నవల అనే రంగస్థలం మీద ఆధునిక ప్రపంచంలో వస్తున్న అన్ని రకాల మార్పుల్నీ ధ్వనింపజేశాడు.

నిజానికి గ్రామాన్ని రంగస్థలంగా మార్చి ప్రపంచం మొత్తం మీద వస్తున్న మార్పుల్ని చూపించాడు. ప్రపంచమొక కుగ్రామమైపోతున్న తరుణంలో, కుగ్రామంలోనే ప్రపంచాన్ని చూపించాడు 'కొండ అద్దమందు కొంచెమైయుండదా' అనే పద్ధతి యిది.

ప్రపంచ గమనాన్ని ప్రపంచం మొత్తం మీద వస్తున్న మార్పుల్నీ, వికృతపోకడల్నీ తాను పుట్టి పెరిగిన మిట్టూరులోనే సూక్ష్మ రూపంలో దర్శిస్తాడు. దీనినే సూక్ష్మంలో మోక్షం, అణువులో బ్రహ్మాండం అనవచ్చు. దీనిని ధ్వని ద్వారా సాధించాడు.

మార్కెట్టు వ్యవస్థలో భాగమై పోయి, లాభమే పరమార్థమని కొత్త కొత్త సరుకులు సమకూర్చుకోవడంలోనే ఆనందం వుందని, డబ్బు కోసం ఏం చేసినా తప్పు లేదనే భావన మార్కెట్టు వ్యవస్థ విస్తరించాక మామూలైపోయింది. అనేక రూపాల్లో వ్యభిచారం ఆకర్షణీయం చేయబడింది. పొట్టకూటికోసం విలాసాల కోసం వ్యభిచారం సర్వ సమ్మతమైపోయింది. పైగా గౌరవనీయమైన విషయంగా మారింది. స్త్రీ తన శరీరాన్ని అంగాంగాల్నీ బహిరంగంగా ప్రదర్శించి ధనం సంపాదించడానికి మోడలింగ్ అని, అడల్ట్ ఫిల్మ్ యాక్టరని, మరొకటని అందమైన పేర్లు వచ్చాయి. దీని పట్ల సమాజంలో నిరసన స్వరాలు కూడా మూగబోయాయి.

ఈ ప్రపంచీకరణ సందర్భంలో పంది వసంత ప్రపంచీకరణకి బీజాలు వేసినదిగా కనబడ్తుంది.

ఆమె సామాన్యురాలా! దేవుణ్ణి కూడా మార్కెట్టు సరుకుగా మార్చెయ్యచ్చని తెలుసుకున్న స్పిరిచ్యువల్ లీడర్. లంజరికం చేసినా అది దేముడు మెచ్చేటట్టుండాల అని తెలుసుకున్న ఆధ్యాత్మికవేత్త. తాను సంబంధం పెట్టుకున్న గుడుగుడు చంద్రా రెడ్డితో మాట్లాడి గుడికి పెట్రోమాక్సు లైట్లు తెప్పించి, గుడిని వెల్తురుతో

ముంచెత్తుతుంది. యీ పెట్రోమాక్సులైటు మిట్టూరులోకి ప్రవేశించడం కొత్త పరిణామం. దీన్నే నేను నా భాషలో శ్వేతాంధకారం అంటాను.

ఇటువంటి కళ్ళు బైర్లు కమ్మించే వెల్తుర్తోపాటు, పంది వసంత మూలింటి లోకి బ్రాయిలర్ కోడి మాంసాన్ని కూడా తేగలిగింది. 'బైలేరు కోడిని గాని తింటే పంటికింద దూది మిటాయి మాదిరి కరిగిపోతాది'. యీ బ్రాయిలర్ కోడిని తెచ్చింది రెడ్డే. పంది వసంత రాకతో మూలిల్లు మొత్తంగా అంగడి యిల్లుగా పేరు మార్చుకుందంటే ఆశ్చర్యమేముంది?

ప్రకృతితో సంబంధం తెగిపోవడం వల్ల, మానవ హృదయంలో సున్నితత్వం నశించిపోయింది. పిల్లలూ, ఎద్దులూ, చెట్లూ, నాగళ్ళూ, వొక్కటొకటిగా అంతరిస్తూ పోవడాన్ని నామిని కళ్ళకు కట్టిస్తాడు. సరే దానితో పాటే ఊహకీ కల్పనకీ ఆస్కారమూ పోయింది. స్త్రీ పురుషుల మధ్య సున్నితమైన భాషకీ, ఊహలకీ ఆస్కారం లేకుండా పోయింది. మిగిలింది కాముకత్వమే. కాముకత్వపు చీకటే. వట్టి దేహాల రాపిడే. దాన్నే బట్టబయలు చేస్తాడు నామిని.

ఇది మిట్టూరు కథ కాదు మొత్తం ప్రపంచం కథ. కాస్తంత మౌనానికీ, ధ్యానానికీ, ఊహకీ, కల్పనకీ ఆస్కారం లేని పతనోన్ముఖమైన ప్రపంచం కథ.

దీనిలో మృత్యువుకున్న జీవితం అత్యంత బీభత్స పూరితమైనది. మనుషుల అశక్తత యిందులోని అసలు విషయం.

యింట్లో భార్య డబ్బుకోసం వ్యభిచరిస్తున్నా మాట్లాడలేని భర్త, మరోవైపు లాభాపేక్షకు గురై ఆమెతో సర్దుకుపోయే భర్త, మౌన నిరసనని తెలియజేసే మూలింటామె, వీరి జీవితాలు నిరంతర బీభత్సాన్నే సూచిస్తాయి. ముఖ్యంగా మూలింటామె యిష్టాయిష్టాలకి స్థానం వుండదు. మరణం కన్న యిటువంటి జీవితమే బీభత్సం. మరణం పర్యవసానమే.

యిది దేవుడు మెచ్చిన లంజరికం, ఊరు మెచ్చిన లంజరికం. ఆత్మవంచనలోకి పతనమైన ఊరు ఊరేకాదని దాని పరువుని మూల మట్టంగా ధ్వంసం చేసేస్తాడు. వొకప్పుడు ఊరి గురించి, ఊరిలోని సున్నితమైన సంబంధాల గురించి, సున్నితమైన సెంటిమెంట్లు గురించి పలవరించిన నామిని, ఊరూ యిల్లూ అంగడిగా మారిపోయిన దుర్మార్గ క్షణాల్ని బీభత్సరసంతో మేళవించి చేదుగుళికల్లా పాఠకులచేత మింగిస్తాడు.

యింతటితో ఎంతోకొంత మర్యాదనీ, గౌరవాన్నీ అభిమానాన్నీ పొందిన నామిని అనుమానపు చూపులకు గురౌతాడు.

ఒకరోజు మృత్యుంజయరావు గారు ఫోనుచేసి దేవుడు మరణించాడు అని జర్మనీ తత్తవేత్త నీషే అన్నాడంటారు కదా, విశ్వనాథ కూడా దేవుడు మరణించెను అని వ్రాశారని చదివి వినిపించారు.

నామిని మరింత ముందుకుపోయి లంజరికం చేసినా దేవుడు మెచ్చేటట్టుండాల అంటాడు. దేవుడు కూడా మహాపతనాన్ని చెందాడు. గాడ్ మార్కెట్టు అనేది కోట్ల వ్యాపారం. వ్యభిచారం కూడా అన్నింటికన్న పెద్ద వ్యాపారమే.

దేవుడికీ, శృంగారానికీ గల అవినాభావ సంబంధం ప్రాచీనమైనది. కాని శృంగారం వ్యభిచార వ్యాపారంగా మారి, దైవాన్ని ఆ రొంపిలోకే లాగెయ్యడం ఆధునికత్వం. దైవభక్తి వల్ల, వ్యభిచారం వల్ల రెండింటిలో దేనివల్లా మానవుడు శాంతిని పొందటం లేదు. పైగా అశాంతినే మూటగట్టుకుంటున్నాడు. అందరికీ చదువు అనేది వ్యాపార సూత్రంగా మారినట్టే దేవుడు కూడా సరుకుగా మారిపోయాడు. అందుకే దేవుడినీ లంజరికాన్నీ వొకే చోట చేరుస్తాడు నామిని.

ముఖ్యంగా ఆధునికతకి సంబంధించిన అన్ని ముసుగుల్నీ తొలగించేస్తాడు. అది హద్దుమీరడంగా కనిపిస్తే చేయగలిగిందేమీ లేదు.

ఎందుకంటె నమ్మకాలు కూడా ఆత్మవంచనగానే మిగిలిపోయాయి. వీరారెడ్డి చెట్లన్నీ కొట్టిస్తూ, వ్యాపారం సాగిస్తుంటాడు. కాని చెట్లు కొట్టేముందు 'ముందు చెట్టుకి దండంపెట్టిగానీ గొడ్డల్తో కొట్టబాకండి' అంటుంటాడు. అడవిలోని చెట్లని కొట్టేస్తుంటే, మొదట వేటు తమమీద పడాలని తర్వాతే చెట్లు కొట్టాలని పోరాడిన చిప్కో ఉద్యమకారులైన గిరిజనులకీ, వీరారెడ్డికీ యెంత తేడా?

అలాగే పంది వసంత కూడా 'మీకు పని జరగాల, నాకు వొడ్డీ మొదులు రావాల' అని దుడ్లను కండ్లకద్దుకొని గానీ యియ్యదు. యిదే పంది వసంత అప్పు తీర్చడం ఆలస్యమైతే, అవతలి మనిషి యెంత దుర్భరమైన పరిస్థితుల్లో వున్నా యెగిరి తంతుంది. దండాలకీ, నమస్కారాలకీ నమ్మకాలకీ వెనుకదాగిన వంచన స్వభావాన్ని బట్టబయలు చేసి గాని వూరుకోదు నామిని. మరి లంజరికాన్నీ దేవుణ్ణీ వొక చోట చేర్చినవాడు కదా!

నిజానికి యిది నామిని కొత్త స్వరం. దేవుడి గురించీ, వెంకన్నబాబు గురించి యెంత సెంటిమెంటుతో రాయలేదు నామిని? అది వొకప్పటి సంగతి, యిప్పటి ఊరు వేరు, యిప్పటి దేవుడు వేరు, యిప్పటి మనుషులు వేరు, యిప్పటి భాష వేరు.

వొకప్పటి మనుషులు ఎటువంటి వారు? మూలింటామె పాత తరానికి ప్రతినిధి. భార్య లేచిపోయిన తన కొడుకు నారాయుడికి వేరే సంబంధం ఆపమని, అందుకు తన సోదరిని ఒప్పించమని మూలింటామె సాయం కోరింది ఎవరినో తెలుసా? మాలోళ్ళ గురివిని. పాత తరం యెన్నో ఛాందసభావాలు కలిగి వుండవచ్చు. కాని ఆ తరానికి హృదయం వుంది. సమయం వచ్చినప్పుడు హద్దుల్ని చెరిపెయ్యగల విశాలత్వం వుంది. నిజానికి ఆ విశాల దృష్టిని ఆధునికత ధ్వంసం చేసింది. అందుకే యెంతో ఆంతరంగికమైన రహస్యాన్ని మాల గురివితో పంచుకుంటుంది మూలింటామె. ఆమెతో అలా కలిసిపోవడం మూలింటామె అక్కకి యే మాత్రం యిష్టం కాదు. ఎందుకంటె ఆమెవి కొత్త తరాల భావాలు. పంది వసంతని యింటిలో ప్రవేశపెట్టింది. అందుకోసం మూలింటామెతో పోరాడిందీ ఎర్రక్కే. యింటి దొంగని యీశ్వరుడైనా పట్టలేడు. మిట్టూరునీ, మూలింటినీ మార్కెట్లో ముంచింది ఎర్రక్కే.

ఆధునికతని నిందించడం కోసం ప్రాచీన గ్రామీణ వ్యవస్థని సర్వ సమగ్రమైనదిగా లోప రహితమైనదిగా చిత్రించడు. కుల వ్యవస్థ మంచిదా, చెడ్డదా అనే ప్రశ్న కూడా కాదు. అసలు విషయం ఏమిటంటే లాభాపేక్షనే పరమంగా భావించి, దాని ప్రకారం నీతినియమాల్ని శాసించే జన స్వభావం, లాభాపేక్ష మానవ స్వభావంలో తెచ్చిన మౌలిక మార్పు.

పంది వసంత రాకముందు కూడా రంజకం వంటివారు మూలింటామెని దెప్పి పొడుపు మాటలు మాట్లాడ్తూనే వుంటారు. ఆమె మనవరాలు మాదిగోడితో లేచిపోవడం గురించి దెప్పిపొడుస్తారు. పంది వసంత వచ్చేప్పటికి ఆమె ధనిక వర్గం వారితో పెట్టుకున్న సంబంధాల్ని సమర్థిస్తారు. ఆ సంబంధాన్ని నిలపడం కోసం కూడా పోరాడ్తారు. రెడ్డి భార్య భర్తతో గొడవపెట్టుకోవడానికి మూలింటికి వస్తే, తిట్టి పంపేస్తారు.

ఈర్ష్యాసూయలు, కుత్సితత్వం అనాదిగా మానవ స్వభావంలో ఉన్నవే. దానికి ఆధునిక లాభాపేక్ష తోడై అగ్నికి ఆజ్యం పోసినట్లై మహావినాశనానికి కారణమౌతోంది.

పాత గ్రామీణ వ్యవస్థనీ, గ్రామాల స్వరూప స్వభావాల్నీ యీ లాభాపేక్ష తుత్తునియలు చేస్తోంది. దాని ఫలితం తీవ్రమైన పరాయీకరణ.

పంది వసంతలోని కలుపుగోలుతనం, స్నేహభావం, ఉదార స్వభావం, ఎప్పుడూ నవ్వుతూ, తుళ్ళుతూ వుండే వుత్సాహం యివేవీ సహజమైనవి కాదు. లాభాపేక్షకి ముసుగులు. యీ పంది వసంతని గ్లోబుపై చూస్తే ఆమె విశ్వరూపం సర్వే సర్వత్రా కనబడ్తుంది. ప్రధానంగా స్త్రీలూ, వారి ఆదర్శభావాలూ కూడా ప్రపంచ మార్కెటీకరణలో భాగమేనన్న సత్యం విషాదాన్నే మిగులుస్తుంది.

యిటువంటి స్త్రీ పాత్రని సృష్టించడం నామిని చేసిన సాహసమే కాదు, దీని ద్వారా ఆదర్శాల ముసుగు కూడా తొలగిపోయి, భయంకర సత్యాలు బయటపడ్డాయి.

ప్రాచీన సమాజంలో లోపాలు లేవని కాదు, ఆ లోపాలకి చెక్ పెట్టే సాంస్కృతిక రూపాలు ఉండేవి. విశ్వాసాలు ఉండేవి. క్రైస్తవ వలసవాదులు వచ్చాకే అడవులు పూర్తిగా ప్రభుత్వ అధీనంలోకి వచ్చాయి. గిరిజనుల బ్రతుకు దుర్భరమైంది. వారి జీవిత విధానం విచ్ఛిన్నమైంది. అలాగే గ్రామాలూ, గ్రామీణ వృత్తులూ ధ్వంసమయ్యాయి. దాని కొనసాగింపే నేటికి కూడా జరుగుతోంది. అందుకే ఆధునికతని విముక్తిదాయకంగా భావించేవాళ్ళే అసలైన లంజరికం చేసే వాళ్ళు. యిదే సత్యాన్ని నామిని పంది వసంత ద్వారా స్పష్టం చేస్తాడు.

అసలు నామిని యీ కథని సెక్సు చుట్టూ ఎందుకు తిప్పాడు.? అన్ని సరుకుల వ్యాపార ప్రకటనలూ, సినిమాలూ, టీవీలూ వీటిలో సెక్సు తప్ప మరేమీ లేవు. లాభమూ, సెక్సూ వొకటైపోయిన చోట నిజానికి సెక్సూ లేదు. యీ పరిస్థితే ఎయిడ్స్ కన్న ప్రమాదకరమైనది.

అసలు నిర్మూలించాల్సింది ఎయిడ్స్‌ని కాదు. టీవీలనీ, సినిమాలనీ, డైరెక్టర్లనీ, హీరో హీరోయిన్లనీ. అందుకే సెక్స్ గురించి మాట్లాడకపోతే జీవితాన్ని గురించి మాట్లాడనట్లే. కాని ప్రగతిశీల రచయితలు సెక్సు గురించి మాట్లాడ్డం మానేసి మర్యాదగా బతికేస్తున్నారు.

యీ పరిస్థితుల్లో నామిని పత్రికల ప్రగతిశీలుర మర్యాద పూర్వకమైన భాషని తుత్తునియలు చేసి మింగుడు పడని వాడుగా మారిపోయాడు.

ప్రగతిశీల రచయితల విజృంభణతో స్త్రీ పాత్రలు కూడా కనుమరుగై పోయాయని నామిని అంటాడు. యిందుకు కాళీపట్నం రామారావు గారి కథలనీ, రావిశాస్త్రి కథలనీ ఉదహరిస్తాడు.

విప్లవకవి శివసాగర్, 'గండు మగటిమి నీదిరా' అంటాడు. నామిని గండు ఆడటిమిని పంది వసంతలో చూపుతాడు.

నిజానికి మూలింటామెలో స్త్రీ పాత్రలే ప్రధానమైనవి. మూలింటామె, ఆమె మనవరాలు, పంది వసంత, రంజకం, మాల గురివి యిలా ఎన్నో స్త్రీ పాత్రలు. స్త్రీ పాత్రల ముందు, వారి భాష ముందు పురుషపాత్రలు చాలా బలహీనంగా కనబడ్తాయి.

నిజానికి చాలామంది స్త్రీ రచయితలు సృష్టించిన స్త్రీ పాత్రలు మగాళ్ళలాగే కనబడ్తాయి. రంగనాయకమ్మ గారి జానకి విముక్తిలో జానకి కాని, ఓల్గా స్త్రీ పాత్రలు కాని, యింకా అనేక మంది స్త్రీ పాత్రలు కాని మూలింటామె, గురివి లాంటి పాత్రల గోటికి కూడా సరిపోలవు. ఈ నవలలోని స్త్రీ పాత్రల సంభాషణలు వారి మధ్య నడిచే డ్రామా అద్భుతం.

యిటువంటి సహజత్వం వుట్టిపడే పాత్రల్నీ సంభాషణలనీ స్త్రీ రచయితలు ఎందుకు సృష్టించలేకపోతున్నారు. శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారు కూడా స్త్రీల కబుర్ల నుంచే భాషని నేర్చుకున్నానన్నాడు. నామిని కూడా అదే చేసినట్లు కనబడ్తుంది.

కాని స్త్రీ రచయితలు పురుషుల నుంచి, ప్రగతిశీల పురుషుల నుంచి భాషని అలవర్చుకున్నట్లు కనబడ్తుంది. కొడవటిగంటి కుటుంబరావునే గురువుగా ఆరాధిస్తారు ఓల్గా. మార్క్సునే పీఠాధిపతిగా భావిస్తారు రంగనాయకమ్మ. స్త్రీలలో తనకు నచ్చేది సౌకుమార్యం అనే మార్క్సు మాటని రంగనాయకమ్మ ఖండించారు. పురుష ప్రపంచంలోకి తాము కూడా చొచ్చుకు వెళ్ళాలంటే, పురుష వ్యాకరణాన్నే నేర్చుకోవాలన్న తపన స్త్రీ రచయితలలో బలపడింది. అది వారిని సిద్ధాంతాలూ, ఆర్థిక సూత్రాలూ వల్లిస్తూ వాటినే సాహిత్యంగా ప్రచారం చేసే స్థాయికి దిగజార్చింది.

యిలోగా నామిని స్త్రీ రచయితలూ, ప్రగతిశీల రచయితలూ బహిష్కరించిన స్త్రీ లోకంలోకి చొచ్చుకు పోయి, స్త్రీత్వాన్నే తన భాషలోకి సంపూర్ణంగా ప్రవేశపెట్టాడు. పురుష కోలాహలానికి దూరంగా నడిచే స్త్రీల కదలికల్నీ, వారి ఏకాంతాన్నీ కులాల కతీతమైన వారి అన్యోన్యతనీ, వారి సెంటిమెంట్లనీ చాలా సంపద్వంతంగా చిత్రించగలిగాడు.

స్త్రీ రచయితలు మాత్రం పురుష పుంగవులు సృష్టించిన ఆర్ద్రతలేని వట్టి డొల్ల భాషలోకి కూరుకు పోయారు. వీళ్ళు నామినిలా తలపోయగలరా, వొక్క వాక్యమైనా రచించగలరా? మాల గురివి ప్రేమగా తెచ్చిచ్చిన కోడిని చూసి ముచ్చటపడ్తూ దీనికి ముక్కు పుడక చేయిస్తే బాగుంటుందని మూలింటామె తలపోసిందని నామిని మాత్రమే రాయగలడు. ఏ ఆడ మగాళ్ళు రాయగలరు!

నిజానికి స్త్రీ ప్రపంచం చాలా కోలాహల పూరితం. సాంఖ్య తత్వం ప్రకృతినే పరిణామశీలంగా నిరంతరంగా చలనంలో వుండేదిగా చూస్తుంది. పురుషుడు ఉదాసీనుడు, నిర్లిప్తుడు. నామిని కూడా పురుష పాత్రల్ని స్త్రీ పాత్రల మీద ఆధారపడేవిగా మార్చేశాడు. ఎందుకలా చేశాడు?

స్త్రీని శక్తి స్వరూపిణిగా పురాణాలు వర్ణించాయి. ఆదిశక్తి, ఆదిమశక్తి స్త్రీయే. మనిషి హేతువుకందని శక్తేదో స్త్రీలో వుందనిపిస్తుంది. అందుకే స్త్రీని మాయ అని కూడా అన్నారు. మాయ అంటే అనిర్వచనీయం, హేతువుకందనిది. స్త్రీ పురుషలింగాల మధ్య ఉన్న దూరం, ఘర్షణ, ఆకర్షణ అతి ప్రాచీనమైనవి.

యీ స్త్రీ శక్తి మార్కెట్ శక్తిగా మారితే? స్త్రీని మార్కెట్ శక్తిగా మార్చాలని మార్కెట్ వర్గాలు భావిస్తూనే వున్నాయి. స్త్రీల కాస్మోటిక్స్ ఉత్పత్తుల కోసం జరిగే ఖర్చు లెక్కలేనిది. ప్రాణావశ్యక మందుల ఉత్పత్తికన్న యీ ఖర్చు యెక్కువని నేను చదివాను. మార్కెట్ పట్ల స్త్రీల ఆకర్షణ, షాపింగ్ పట్ల వారి ఆసక్తి పురుషుల్ని మించిపోయింది.

అందుకోసమే స్త్రీలు విద్యావంతులు కావాలని మార్కెట్ భావిస్తుంది. వాళ్ళు ఆధునికీకరించబడడం మార్కెట్టుకి ఎంతో అవసరం. యీ మార్కెట్టు అవసరం నుంచే స్త్రీ వాదం పుట్టింది. అందుకే స్త్రీ వాదులు పాశ్చాత్య ఆధునికీకరణని సంపూర్ణంగా ఆహ్వానించారు. వలసవాద సంస్కరణకి వెన్నుదన్నుగా నిలిచిన వీరేశలింగం పంతులు, గురజాడలని ఆకాశానికెత్తారు. అంతేకాని సంప్రదాయ విద్యనీ, సంగీతాన్నీ అభ్యసించిన మహా కళాకారులు బెంగుళూరు నాగరత్నమ్మ గారిని పట్టించుకోలేదు. ఆమెని తొలి స్త్రీ వాదిగా ప్రకటించలేదు. ఆమె రాసిన ప్రేమ కవితని మెచ్చలేదు. ముద్దుపళని రచనలని వెలుగులోకి తేవడం కోసం ఆమె వీరేశలింగంలాంటి పురుష పుంగవులతో చేసిన పోరాటాన్ని ఆకాశానికెత్తలేదు. ఎందువల్ల? ఆమె భారతీయ సంప్రదాయం పట్ల, సంస్కృతి పట్ల గౌరవం కలిగింది.

అందుకే ఆమె లాంటి వాళ్ళని పక్కనబెట్టి కాళీపట్నం రామారావు, కొడవటి గంటి కుటుంబరావు లాంటి వాళ్ళు రాసిన పొడి వచనాన్ని అనుకరిస్తూ కథలు రాశారు స్త్రీ వాదులు. వార్తలకీ, కథలకీ దూరం చెరిపేస్తున్నారు. సమస్యల గురించి ప్రస్తావించడమే సాహిత్యమని ప్రచారం చేస్తున్నారు. ఇదే సమయంలో స్త్రీలు, స్త్రీల భాషని నేర్చుకోవాలని నామిని లాంటి పురుషుడు గుర్తు చేయవలసి రావడం స్త్రీ జాతికి సిగ్గుచేటు.

అదే సమయంలో స్త్రీ శక్తి మార్కెట్ శక్తిగా మారిపోతే ఎక్కువగా గ్రామాల మీద ఆధారపడిన భారతీయ జీవన విధానానికే ముప్పు అని పంది వసంత పాత్ర ద్వారా గుర్తుచేస్తున్నాడు. ఆధునికతతో మమేకమైన స్త్రీ, పంది వసంతలా మారిపోయే ప్రమాదం వుందని హెచ్చరిస్తున్నాడు. స్త్రీలు స్త్రీవాదం నుంచి బయటపడి, గ్రామీణ స్త్రీల సహజభాషని అధ్యయనం చెయ్యాలని, అప్పుడే తమ సొంత అభివ్యక్తిని అలవరచు కొనగలరని ధ్వని పూర్వకంగా స్ఫురింపజేస్తున్నాడు.

లేకపోతే స్త్రీలు 'సౌకుమార్యం' వల్లనో, అమాయకత్వం వల్లనో, సహజ స్వభావం వల్లనో కాపాడుతూ వచ్చిన మానవీయ విలువలు, ప్రకృతినంతటినీ తనలో పొదవి పట్టుకొనగలిగిన విశ్వమంతటి విశాలమైన భాష కనుమరుగై పోతుందని హెచ్చరిస్తున్నాడు నామిని.

అదే సమయంలో స్త్రీ చుట్టూ ఆవరించుకొని వున్న మిథ్యావరణాన్ని ఛేదించాడు నామిని. స్త్రీ పీడితురాలు కనుక, స్త్రీ ఆటబొమ్మ అనే భావన వుంది. కాని మార్కెట్టులోకి చొచ్చుకుపోయిన స్త్రీ, పురుషుల్ని ఆటబొమ్మలుగా చేసి ఆడించగలదని, ఆ క్రమంలో స్త్రీ యెంతకైనా తెగించగలదని నిరూపించాడు నామిని.

పీడితులే మరింత దుర్మార్గంగా ప్రవర్తించే అవకాశం వుందని ఉస్మానియా న్యాయశాస్త్ర విద్యార్థి చరణ్ వొకసారి అన్నాడు. యిందుకు హిట్లర్‌ని ఉదాహరణగా చూపాడు. బాల్యంలో యూదులవల్ల అవమానానికి గురైన హిట్లర్ తరువాత మహా నియంతగా మారిపోయాడు. మళ్ళీ పీడిత యూదులనుంచే అరబ్‌ల అణచివేత మొదలైంది.

అందువల్ల స్త్రీల నుంచే మరింత అగ్రెసివ్ మార్కెట్ శక్తులు పుట్టుకువచ్చే ప్రమాదముంది. అది యిప్పటికే మొదలైంది. స్త్రీ ఎన్‌జీవోలు దీనికి తార్కాణం.

కొంపముంచి ప్రగతిశీల పరిభాష స్త్రీలని ప్రాచీన బంధనాల నుంచి విముక్తం చేసి, మార్కెట్టులోకి ప్రవేశపెట్టిందా? వెంటనే మరో ప్రశ్న యెదురౌతుంది అసలు ప్రాచీనమైనవన్నీ బంధనాలేనా? యీ ప్రశ్న బెంగుళూరు నాగరత్నమ్మ గారి లాంటి వారి జీవితం లేవనెత్తింది. యిదే ప్రశ్నని నామిని కూడా లేవనెత్తుతున్నాడు.

చెట్లూ, పక్షులూ, కోళ్ళూ, పిల్లలూ, మనుషులూ అంతా కలగలసి పోయిన గ్రామాన్ని, కులాల కతీతంగా సహానుభూతిని వ్యక్తం చెయ్యగలిగిన గ్రామాన్ని మార్కెట్ వ్యవస్థ సమూలంగా నాశనం చేస్తోంది. ఆ వినాశనంలో పంది వసంత, ఆధునిక ఆకర్షణల వైపు ఆమె వెర్రి పరుగూ కూడా కారణమే.

సరుకుల పట్ల మితిమీరిన ఆకర్షణ స్త్రీలకు చాలా ఎక్కువ. దానికి పురుషుడే కారణమని అనవచ్చు కాని, ఆ వాదం లేవదీసిన స్త్రీ వాదులు కూడా మార్కెట్టులో చాలా ప్రధానమైన భాగమైపోయారు. యీ తరుణంలో పంది వసంత పాత్ర చిత్రణ సమయోచితమైనది.

యింతగా అన్ని కోణాల్లో స్త్రీ పాత్రల్ని సృష్టించిన నామినిని నేను అర్ధేశ్వర నారి అంటాను. అటువంటి కొత్త పదబంధాన్ని సృష్టిస్తాను.

అసలు ఆధునిక సాహిత్యంలోనూ, జీవితంలోనూ సహజత్వం లోపించింది. నేటి కులాంతర వివాహాలు కుల నిర్మూలనకు ఎందుకు దారితీయవంటే, ప్రతీదీ లాభాపేక్షతో కూడిన ప్రపంచంలో ఆదర్శం కూడా సరుకే. అసలు ఆదర్శమనే పదమే అసహజం. మాల గురివికీ మూలింటామెకీ గల అనుబంధంలో ఆదర్శాలేవీ లేవు. అది ప్రణాళికా బద్ధం కాదు. అది సహజ అనుబంధం. ఆదర్శం అనేది లాభాపేక్షకి ముసుగుగా వచ్చింది. లేకపోతే అటువంటి పదమే అవసరం లేదు.

అందుకే సహజమైన అభివ్యక్తి మారుమూల గ్రామాల్లో ఆధునిక సంస్కారం, విద్య చొరబడని చోటే కనబడ్తుంది. అక్కడి నుంచి రావడమే కాదు, ఆ స్మృతుల్ని కోల్పోకపోవడం వల్లే నామిని అంత సహజమైన భాషలో సహజ ఆర్ద్రతని వ్యక్తం చేశాడు.

ప్రగతివాదులు, కవులు ప్రజలనుంచి నేర్చుకోవాలని బోధిస్తారు. అదే సమయంలో వారికి తిరిగి బోధించాలంటారు. వారి భాషలోనే వారి కళారూపాల్లోనే వారికి బోధించాలంటారు. బోధకులు కావడం కోసమే వారి నుంచి నేర్చుకోవడమన్న మాట. దానివల్ల జరిగిందేమిటి. వారిని ఆధునీకరించడానికి, మార్కెట్లో భాగం

చెయ్యడానికి వలసీకరించడానికి వారి భాషనే ఉపయోగించడం జరిగింది. వారు నేర్చుకోవలసిన వారుగానూ, మార్చబడవలసిన వారుగానూ అనాగరికులు గానూ భావించబడడం వల్ల వారి సంస్కృతికే ముప్పు ఏర్పడింది. యిక్కడే నామిని గత తరానికి సంబంధించిన మూలింటామెని పునరుద్ధరించి ఆధునికతపై సంధిస్తాడు.

అంటే నామిని భాషని, నామిని చెప్పిన కథనీ అనుభూతి చెందాలంటే ఆధునిక విద్య నుంచి వచ్చిన, ఆధునిక నాగరికత నుంచి అబ్బిన భాషనీ భావాల్నీ విస్మరించాలి. అప్పుడే నామిని అవగతమౌతాడు.

ఎందుకంటె భాష ఆధునిక యుగంలో కమ్యూనికేషన్ స్కిల్‌గా మారిపోయింది. అంటే ప్రాగ్మాటిక్ దృక్పథంతో భాషని చూడడం మొదలైంది. సౌందర్యం రసాత్మకత మినహాయించబడింది.

మొదట కమ్యూనిస్టులూ, ప్రగతిశీల రచయితలూ అవసరం, ప్రయోజనం అనే పదాలకి సాహిత్యంలో పెద్దపీట వేశారు. ప్రజల భాషనీ, నానుడుల్నీ, కళారూపాల్నీ కూడా తమ సిద్ధాంతాలకి అనుగుణంగా మలచుకోవాలనే తాపత్రయంలో జనం నుంచి నేర్చుకోవడం లేకుండా పోయింది. దానివల్ల భాష గిడసబారిపోయింది. రసం చచ్చిపోయింది.

ముఖ్యంగా ప్రగతిశీల రచనల్లో స్త్రీ పాత్రలు తగ్గిపోయాయి. శ్రీపాద, చలం వంటి రచయితలు స్త్రీ పాత్రలని సృష్టించడంలో గొప్ప ప్రజ్ఞని కనబరిచారు. కాని ప్రగతిశీల రచయితలు పురుష పాత్రలకే అగ్రస్థానం ఇచ్చారు. 'గండు మగటిమి నీదిరా' అన్నారు.

స్త్రీ వాదుల రంగప్రవేశం ఆశాజనకమైంది కాదు. వారు లింగాతీత స్థితిలో రచనలు చేశారు. డక్కలి జాంబపురాణంలో వొక వింత ప్రయోగం వుంది. మగపురుషులూ, ఆడస్త్రీలూ అని ఆ ప్రయోగం. స్త్రీ వాదులు 'మగస్త్రీల'ని సృష్టించారు. అంటే వూరికే పేర్లు స్త్రీల పేర్లు వుంటాయి. కాని ఆ పాత్రలు స్త్రీ పాత్రల్లా ఆనవు. కూచిపూడి నృత్యకళాకారుడు వేదాంతం సత్యనారాయణ గారు భామాకలాపంలో నటిస్తుంటే, అచ్చం స్త్రీలాగే అలరించేవారు. నాటకాల్లో, స్థానం నరసింహారావు గారి లాంటి వారు స్త్రీ పాత్రలని అద్భుతంగా పోషించేవారంటారు. చలం, సుబ్రహ్మణ్యశాస్త్రి లాంటి వారు కూడా స్త్రీ పాత్రలని హృదయంగమంగా సృజించారు.

కాని మన స్త్రీవాదులూ, లెఫ్టిస్టు స్త్రీలూ, స్త్రీలు కాని స్త్రీలని సృష్టించారు. రసాత్మకమైన వొక్క వాక్యాన్నీ రచించలేకపోయారు. నీరస సిద్ధాంతాలూ, నీతులూ, ప్రయోగాలూ వల్లెవేసే రోబో పాత్రల్ని సృష్టించి, అదే సాహిత్యమన్నారు. అవార్డులు గెలుచుకున్నారు. సమాజంలో పరువు ప్రతిష్టల్నీ డబ్బునీ సంపాదించడానికి ఉపయోగించుకుంటున్నారు. వారు తమ ముందుతరం ప్రగతిశీల పురుషుల్ని అనుకరించి, వారికంటె ముందుకు పోయి సాహిత్య ప్రయోజనం అంటే స్వప్రయోజనం అనే మార్కెట్ సూత్రాన్ని వంటబట్టించుకున్నారు.

అవసరం, ప్రయోజనం అనే ప్రగతిశీల సిద్ధాంతాలూ, మార్కెట్ అవసరం మార్కెట్ ప్రయోజనం అనే అర్థంలోకి మారిపోయాయి. దీనిలో స్త్రీల పాత్ర కూడా తక్కువేమీ కాదు.

యిటువంటి పరిస్థితుల్లో నామిని స్త్రీ పాత్రలు అతి సహజమైన భాషతో, సహజ నుడికారంతో, స్త్రీల మధ్య వుండే రాగద్వేషాల్ని సహజంగా స్ఫురింపజేస్తూ స్త్రీ పాత్రలు అంటే యిలా వుండాలనే అనుభూతిని కలుగజేస్తాయి. అనుభూతి రహితమైన భాష స్థానంలో, స్మృతులతో నిండిన గాఢమైన భాషని మన ముందుంచుతాయి. భాష కూడా సజీవమైన ప్రాణి అని, అది మానవ అవసరాలు తీర్చే పనిముట్టు కాదని యీ నవలలోని భాష నిరూపిస్తుంది. కథకీ – వార్తకీ, పాత్రికేయ భాషకీ – సాహిత్య భాషకీ గల తేడాని నామిని స్పష్టం చేసాడు. తద్వారా భాషనీ, సాహిత్యాన్నీ మార్కెట్టులో లయం చేయడానికి గట్టి ప్రయత్నం చేస్తున్న స్త్రీ వాదుల్నీ, ప్రగతిశీల రచయితలందర్నీ అడ్డుకుంటున్నాడు, వరదని మడ అడవులు ఆపినట్లు.

నిజానికి స్త్రీవాదుల్లో ఫక్తు మగటిమి కనిపిస్తే, నామినిలో నామిని రచనలో స్త్రీత్వం ఉట్టిపడడం ఆశ్చర్యకరమైన విషయం.

నిజానికి భారతీయ వేదాంతం చెప్తున్నదేమిటి? భగవంతుడొకడే పురుషుడు. మిగిలిన వారంతా స్త్రీలేనని భాగవత తత్వం బోధిస్తోంది. నామిని ఆ తత్వాన్ని జీర్ణించుకున్నాడా? ఇంతకీ నామిని పురుషుడా, స్త్రీయా? కొందరు అనుయాయులు గాంధీని అమ్మ అని పిలిచేవారని ఆశిష్‌నంది 'ఇంటిమేట్ ఎనిమీ' గ్రంథంలో రాశారు. మూలింటామెకి జన్మనిచ్చిన నామినిని కూడా మనం అమ్మా అని పిలవడం ఉచితం.

నామిని సుబ్రహ్మణ్యం నాయుడు : 'పచ్చ నాకు సాక్షిగా' పుస్తకం ద్వారా తెలుగు సాహిత్యాన్ని నేలమీద, మబ్బుల్లోనూ ఏక కాలంలో నడిపించిన కవి మాంత్రికుడు, కథక ఐంద్రజాలికుడు. ఆయనని అనుకరిస్తూ, అనుసరిస్తూ తెలుగు సాహిత్య లోకంలో రంగు రంగుల పూలలా కథకులెందరో వికసించారు. 'నామిని పెద్ద పుడింగి' సృష్టించిన సంచలనం నుంచి తేరుకోక ముందే, 'మూలింటామె' నవల ద్వారా కల్లోలం సృష్టించాడు నామిని.

రాణి శివశంకరశర్మ : 'ది లాస్ట్ బ్రాహ్మిణ్' గ్రంథం ద్వారా కుల మతాలు, భారతీయ తత్వశాస్త్రం, సనాతన ధర్మం గురించి తీవ్ర చర్చని రేకెత్తించిన మేధావి. ఆ మహా గ్రంథం ఇంగ్లీషు కన్నడ భాషలలోకి అనువాదమైంది. గ్రహాంతరవాసి, పురాణవేదం, అమెరికనిజం యితర గ్రంథాలు.

స్త్రీవాదులు మగ స్త్రీ పాత్రలని సృష్టించారు.
నామిని అచ్చమైన ఆడ స్త్రీ పాత్రలని సృజించాడు.
ఆ పాత్రల పరిణత స్థితే 'మూలింటామె' నవల.